

బస్సు ప్రమాదం నుంచి పది మందిని కాపాడిన

హరీష్

హైవేపై ధర్మవరం టెకీ సాహసం

(వివరాలు మెయిన్‌లో..)

హైవే వెహికిల్స్..!



- రాత్రి ప్రయాణాలకు భద్రత కరువు
- హృదయాలను కలిచివేసిన కర్నూలు ప్రమాదం
- పన్నెండేళ్ల కిందట 45 మంది.. ఇప్పుడు 19 మంది..
- ఏసీ బస్సులో బుగ్గి అయిన ప్రాణాలు
- ఉమ్మడి జిల్లా నుంచి పెరిగిన వీకెండ్ ప్రయాణాలు
- భద్రత గాలికి.. ఆదాయంపైనే ట్రావెల్స్ దృష్టి

అనంతపురం క్రైం/నెట్‌వర్క్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం ఉమ్మడి జిల్లావాసులను కంటతడి పెట్టించింది. ఉదయం లేవగానే ఈ విషాదకర సంఘటన గురించి తెలుసుకుని జనం ఆవేదన చెందారు. న్యూస్ చానళ్లు, సోషల్ మీడియాలో ప్రమాద దృశ్యాలను చూసి చలించిపోయారు. జాతీయ రహదారులపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులలో ప్రయాణం అంటేనే జంకే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. బెంగళూరు-హైదరాబాదు 2013 అక్టోబరులో మహబూబ్‌నగర్ జిల్లాలో ఓ ప్రైవేటు బస్సు దగ్ధమై 45 మంది సజీవ దహనమయ్యారు. పుష్కర కాలం తరువాత ఇదే నెలలో కర్నూలు జిల్లా చిన్న టేకూరు వద్ద మరో ఘోరం జరిగింది. బస్సులో 19 మంది సజీవ దహనమయ్యారు. ఇవి కాక అనేక ప్రమాదాలు జరిగాయి. దీంతో ట్రావెల్ బస్సులలో భద్రత గురించి మరోమారు చర్చ మొదలైంది. ఏసీ బస్సుల్లో జాతీయ రహదారిపై ప్రయాణం చేయాలంటే ఆలోచించాల్సిందేనని జనం అంటున్నారు. కొన్ని బస్సుల్లో భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, రవాణా శాఖ అధికారులు పట్టించుకోకపోవడం లేదని అంటున్నారు. ప్రయాణికుల భద్రత గాలికి వదిలేశారని మండిపడుతున్నారు. ఈ ప్రమాదంపై జిల్లా ప్రజాప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అండగా (మిగతా 6వ పేజీలో..)



అండగా ఉంటాం..

బస్సు ప్రమాద ఘటన దురదృష్టకరం. ప్రయాణికులు సజీవదహనం కావడం కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా ఆదుకుంటాం. ఈ ప్రమాదం గురించి సీఎం చంద్రబాబు తెలుసుకున్నారు. గాయపడ్డవారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

-మంత్రి పయ్యావుల



అత్యంత విషాదకరం..

కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదంలో ప్రయాణికులు చనిపోవడం తీవ్రంగా కలచివేసింది. గాఢ నిద్రలో ఉన్నవారు సజీవదహనం కావడం అత్యంత విషాదకరం. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నాను. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాను. సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రమాద బాధిత కుటుంబాలను అదుకుంటుంది.

- కాలవ శ్రీనివాసులు, ప్రభుత్వ విప్



నీట మునిగిన విశ్వశాంతి నగర్

వాన వెల్లువ

ఉధృతంగా ప్రవహించిన ఆలమూరు చెరువు మరువ

- రుద్రంపేట పరిధిలోని పలు కాలనీలు జలమయం
- వరదలో చిక్కుకున్న విశ్వశాంతి నగర్
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- 11 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- పలు ప్రాంతాల్లో పంట నష్టం
- మరో ఐదు రోజులు వర్షాలు

వివరాలు 6వ పేజీలో...

రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యం

- హంద్రీనీవాకు నిధులిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు
- హెచ్ఎన్ఎస్ఎస్‌కు 50టీఎంసీల నీరు రాబట్టాలి
- రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- తారతమ్యాలు లేకుండా నీటి కేటాయింపులు: కలెక్టర్
- ఐఏబీ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యేల చర్చ

7లో



నత్తల నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

7లో

వర్షాల వేళ బడుల్లో భద్రం

- తడిసిన గోడల వద్దకు పిల్లలను పంపకండి
- హెచ్ఎంలు, టీచర్లకు డీఈఓ సూచన

అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పాఠశాలలకు వచ్చిన పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హెచ్ఎంలు, టీచర్లకు డీఈఓ ప్రసాద్‌బాబు సూచించారు. మూడురోజులుగా ఎడతెరపిలేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం డీఈఓ.. పలు సూచనలు చేశారు. పాఠశాలలో వర్షాలకు తడిసిన గోడల వద్దకు పిల్లలు వెళ్లకుండా చూడాలన్నారు. కారుతున్న, దెబ్బతిన్న భవనాల్లో ఎట్టిపరిస్థితుల్లోనూ పిల్లలను కూర్చో బెట్టరాదన్నారు. పాఠశాలలకు వచ్చిన పిల్లలు సమీపంలోని చెరువులు, వంకలు వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పర్యవేక్షించాలన్నారు. పాఠశాలల ఆవరణాల్లో నీటి కుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. వర్షాలు కురిసినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పిల్లలకు అవగాహన కల్పించాలని డీఈఓ ఆదేశాలు జారీ చేశారు.



బీటీపీ పనులు సకాలంలో పూర్తి చేస్తాం

- చెరువులన్నింటినీ కృష్ణాజలాలతో నింపుతాం
- ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని

కళ్యాణదుర్గం/రాయదుర్గం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బీటీపీ కాలువ పనులను సకాలంలో పూర్తి చేసి, రాయదుర్గం, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోని ప్రతి చెరువును కృష్ణా జలాలతో నింపుతామని ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. బ్రహ్మసముద్రం మండలంలోని బీటీపీ ప్రాజెక్టు వద్ద శుక్రవారం గంగపూజ, జలహారతి చేపట్టారు. వారం రోజులుగా బీటీపీ ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు వరద నీరు ప్రాజెక్టుకు వచ్చి చేరుతోంది. దీంతో టీడీపీ నాయకులు, రైతులతో కలిసి ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని గంగపూజ, జలహారతి చేపట్టారు. అనంతరం బీటీపీ గెస్ట్ హౌస్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అక్కడే మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే అమిలినేని మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం బీటీపీ కాలువ పనులను పూర్తి చేయకుండా, రైతులను నట్టేట ముంచిందని విమర్శించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవ తీసుకుని బీటీపీ కాలువ స్థితిగతులపై సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారన్నారు. సీఎం సానుకూలంగా స్పందించడంతో బీటీపీ కాలువ పనులను ప్రారంభించామన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా పనులను వేగంగా పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ కర్ణాటక ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు వాణి విలాస్ సాగర్ నిండటంతో ఆ ప్రాజెక్టు నుంచి 3వేల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారన్నారు. మన ప్రాంతానికి 600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందన్నారు. ఇది మరో ఆరు రోజులు ఇలాగే సాగితే 2 టీఎంసీల నీళ్లతో బీటీపీ డ్యామ్ పూర్తిస్థాయిలో నిండుతుందన్నారు. రైతులు ఐకమత్యంగా నీటిని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయాశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బీటీపీ వద్ద గంగమ్మకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యేలు కాలవ, అమిలినేని

డ్రగ్స్, గంజాయిని అరికట్టాలి

అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన ఎస్పీ

అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): డ్రగ్స్, గంజాయి సమస్యను అరికట్టడంలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన ఎస్పీ జగదీష్‌తో కలిసి మాదకద్రవ్యాలు, గంజాయి నియంత్రణ చర్యలు-అవగాహన కార్యక్రమాల సమీక్షకు సంబంధించి ఎన్సీఓఆర్డీ(నార్కో కోఆర్డినేషన్ సెంటర్) జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా కోసం తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కలెక్టర్, ఎస్పీలు మాట్లాడుతూ... విద్యార్థులు, ప్రజల్లో ఈగల్ టోల్ ఫ్రీ నెంబర్ 1972, క్యూఆర్ కోడ్ గురించి, డ్రగ్స్, గంజాయి ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. డీ-అడిక్షన్ సెంటర్, ప్రిజన్ వార్డ్‌లను బలంగా ఏర్పాటు చేయాలని, డ్రగ్ వ్యసన బాధితుల పునరావాసానికి సమర్థవంతంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ, జీజీహెచ్ సూపరింటెండెంట్‌లను ఆదేశించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులు తమ పరిధిలో మాదకద్రవ్యాల అక్రమ కార్యకలాపాలు జరగకుండా చూడాలని సూచించారు. వాహనాల తనిఖీలను మరింత బలోపేతం చేసి, డ్రగ్స్, గంజాయి రవాణాను నిరోధించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని డీటీసీని ఆదేశించారు.

రోడ్డు భద్రత కోసం పటిష్ఠ చర్యలు

జిల్లాలో రోడ్డు భద్రత కోసం పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. రోడ్డు భద్రత కోసం తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా వాహనాల పార్కింగ్ స్థలాలను గుర్తించాలని, నగరపాలక సంస్థ, ట్రాఫిక్ అధికారులను ఆదేశించారు. గుత్తి-గుంతకల్లు రోడ్డులోని రోడ్, ఆర్ఓబీని, రాప్తాడు వద్ద రైల్వే లైన్ ఉన్న బ్రిడ్జిని త్వరగా పూర్తి చేసి రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో గుర్తించిన స్థలాల్లోనే బస్సులు నిలిపేలా మున్సిపల్ కమిషనర్‌తో సమన్వయం చేసుకుని ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎన్ఐసీ వారు అభివృద్ధి చేసిన ఐరాడ్ యాప్‌లో సీహెచ్‌సీ, ఏరియా ఆసుపత్రులు, ప్రైవేట్ ఆసుపత్రులలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వారి వివరాలను నమోదు చేయాలన్నారు. నగరంలోని తపోవనం బైపాస్ వద్ద జాతీయ రహదారిలో స్ట్రీట్ లైట్లను టౌన్ డీఎస్పీతో సమన్వయం చేసుకుని నేషనల్ హైవే వారు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు కేశవనాయుడు, వసంతబాబు, ఆర్ అండ్‌బీ ఎస్ఈ మురళీకృష్ణ, డీటీసీ వీర్రాజు, నేషనల్ హైవే పీడీ తరుణ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ అర్చన, నగర కమిషనర్ బాలస్వామి, డీఎస్పీలు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయం..!

- బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాసం నేపథ్యంలో ఉత్కంఠ
- వైసీపీ శిబిరానికి ఓ ఎంపీటీసీ డుమ్మా
- ఓ సభ్యుడి కిడ్నాప్ కలకలం..!

(వివరాలు 7లో..)

కూతురిపై తల్లి విజయం

ఆదరించనందుకు భూమిని తిరిగి పొందిన లక్ష్మమ్మ

(వివరాలు 7లో..)

సెక్టోరల్‌పై ముగిసిన విచారణ

- అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన
- ఇంటర్వ్యూలు, ఎంపికపైనా త్రిసభ్య కమిటీ ఆరా

అనంతపురం విద్య, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష సెక్టోరల్ పోస్టులపై విచారణ ముగిసినట్లు అధికారవర్గాల సమాచారం. సెక్టోరల్ భర్తీ తొలి నుంచి వివాదాస్పదంగానే నడిచింది. తొలి నోటిఫికేషన్‌ను పక్కన పెట్టి ఈఏడాది జూలైలో ఆరు సెక్టోరల్ పోస్టుల భర్తీకి రెండోసారి నోటిఫికేషన్ ఇచ్చారు. ఆగస్టులో ఇంటర్వ్యూలు నిర్వహించి ఐదు పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేశారు. జాబితాకు కలెక్టరు ఆమోదం వేసి రాష్ట్రశాఖకు పంపారు. అక్కడ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు గతనెలాఖరులో జాయిన్ అయ్యారు. అయితే ఇందులో కూడా అక్రమాలు జరిగాయని, ఎస్సీ, ఎస్టీలకు అవకాశం కల్పించలేదంటూ కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో కలెక్టర్ ఆనంద్ విచారణకు అసిస్టెంట్ కలెక్టరు సచిన్‌రహార్, ఎస్సీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారి, ఎస్టీ వెల్ఫేర్ డీడీ శ్రీనివాసరావులతో త్రిసభ్యకమిటీని నియమించారు.

నేడు కలెక్టర్‌కు నివేదిక

సెక్టోరల్స్ నియామకాల ప్రక్రియపై కలెక్టర్ నియమించిన కమిటీ వెంటనే విచారణకు దిగింది. త్రిసభ్య కమిటీ సభ్యులు గురు, శుక్రవారాల్లో విచారణ చేపట్టి పూర్తి చేసినట్లు సమాచారం. విచారణలో భాగంగా తొలిరోజు సెక్టోరల్స్ ఎంపిక విధానాలు, నిబంధనలు, ఇంటర్వ్యూలు, మార్కులు, మెరిట్ అంశాలను పక్కాగా పరిశీలించి ఎంపిక విధానం గురించి ఆరా తీసినట్లు తెలిసింది. రెండో రోజు శుక్రవారం ఎంపికై జాయిన్ అయిన అభ్యర్థుల నుంచి ఒరిజినల్ సర్టిఫికెట్లను తెప్పించుకొని పరిశీలించినట్లు సమాచారం. ఆ సమయంలో కన్నడ అభ్యర్థిగా ఎంపికైన వ్యక్తి కర్ణాటకలో ఆరో తరగతి మాత్రమే చదివారని, ఎలా ఇచ్చారని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. ఆ పోస్టుకు 11మంది దరఖాస్తు చేసుకోగా, అందులో ఏ ఒక్కరికీ కన్నడ లేదని, ఆయన కనీసం ఆరో తరగతి అయిన చదివాడని, అందుకే ప్రాజెక్టులో పని చేయించుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు అధికారులు సమాధానం ఇచ్చినట్లు సమాచారం. స్కూల్ అసిస్టెంట్‌గా 8 ఏళ్ల సర్వీసు లేని వ్యక్తిని ఎందుకు ఎంపిక చేశారని ప్రశ్నించగా ఆయనకు ఎస్టీటీగా 28ఏళ్ల సర్వీస్ ఉందని వివరించినట్లు తెలిసింది. ఎస్సీ, ఎస్టీలకు ఎందుకు అవకాశం ఇవ్వలేదనే ఫిర్యాదులపై ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ శాఖల అధికారులతో దీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. డెప్యుటేషన్ పోస్టులకు రిజర్వేషన్స్ వర్తించవని, ప్రతిభ ఆధారంగానే ఎంపిక ఉంటుందని, దీనిపై కలెక్టరుకే నిర్ణయాధికారం వదిలిపెట్టినట్లు విచారణ కమిటీలో ఉన్న ఓ అధికారి తెలిపారు. ఈ విచారణ నివేదికలను పూర్తి స్థాయిలో సిద్ధం చేసి శనివారం కలెక్టరుకు ఇవ్వనున్నట్లు సమాచారం.



విశ్వశాంతి నగర్‌లో ఇళ్ల మధ్య ప్రవాహం

వాన వెల్లువ

ఉధృతంగా ప్రవహించిన ఆలమూరు చెరువు మరువ

- రుద్రంపేట పరిధిలోని పలు కాలనీలు జలమయం
- వరదలో చిక్కుకున్న విశ్వశాంతి నగర్
- సహాయక చర్యలు చేపట్టిన అధికారులు
- 11 మందిని కాపాడిన అగ్నిమాపక సిబ్బంది
- పలు ప్రాంతాల్లో పంట నష్టం
- మరో ఐదు రోజులు వర్షాలు

వాన దంచికొట్టింది. జిల్లాలోని చాలా మండలాల్లో గురువారం రాత్రి ఎడతెరపి లేని వాన కురిసింది. పలు వంకలు, వాగులు ఉప్పొంగాయి. అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు చెరువు మరువ ఉధృతంగా ప్రవహించడంతో రుద్రంపేల పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. విశ్వశాంతి నగర్ వదర నీటిలో చిక్కుకుంది. కాలనీవాసులు వరద నీటిలో బిక్కుబిక్కుమంటూ గడిపారు. మరో ఐదురోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాస్త్రవేత్తల హెచ్చరికల నేపథ్యంలో జనం వణికిపోతున్నారు. విశ్వశాంతి నగర్‌లో వరద నీటిలో చిక్కుకున్న 11 మందిని అగ్నిమాపక శాఖాధికారులు రక్షించారు.

అనంతపురం రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. హంద్రీనీవా నీటితో అనంతపురం రూరల్ మండలంలోని ఆలమూరు చెరువు పూర్తిగా నిండి, మూడు రోజుల కిందట మరువ పారింది. దీనికి వర్షపునీరు తోడవటంతో ప్రవాహం పెరిగింది. ఆ నీరు అనంతపురం రూరల్ మండలంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని పలు కాలనీలను ముంచెత్తింది. తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఒక్కసారిగా విశ్వశాంతినగర్, గౌరవ్ రెసిడెన్సీస్, వికాస్ నగర్ ప్రాంతాలు నీటమునిగాయి. సాయంత్రమైనా ఇదే పరిస్థితి కనిపించింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు. నీరు ఇళ్లలోకి చేరడంతో నిత్యావసర సరుకులు, వస్తువులు తడిసిపోయాయి. ఈక్రమంలో మండల పరిషత్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు అధికారులు అప్రమత్తమయ్యారు. సహాయక చర్యలు చేపట్టారు. ఇళ్లలోకి నీరు వెళ్లకుండా ఎక్స్‌కవేటర్లతో స్థానికంగా ఉన్న కాలువలోకి మళ్లించారు. ఇళ్లలో నుంచి బయటకు వచ్చేందుకు ఇబ్బంది పడుతున్న వారికి అగ్నిమాపక శాఖ సిబ్బంది రోప్ సాయంతో తీసుకొచ్చారు. అల్పాహారం, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. నష్టం వివరాలను రెవెన్యూ అధికారులు.. స్థానికుల ద్వారా సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరికుమార్, ఎంపీడీఓ దివాకర్, సీఐ జగదీష్ పాల్గొన్నారు. కొడిమి గ్రామ సమీపంలో రాచానపల్లి వంక ఉధృతంగా ప్రవహించింది. దీంతో జర్నలిస్టుల కాలనీ, దర్గాకొట్టాల తదితర ప్రాంతాల ప్రజలు నగరానికి వచ్చేందుకు ఇబ్బందులు పడ్డారు.



విశ్వశాంతి నగర్‌లో ఇళ్లలోకి చేరిన నీరు

11 మందిని కాపాడిన ఫైర్ సిబ్బంది

అనంతపురం క్రైం: వరద నీటిలో ఇళ్లలో చిక్కుక్కున్న 11 మందిని జిల్లా అగ్నిమాపకశాఖ అధికారులు సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రుద్రంపేట పంచాయతీలోని విశ్వశాంతినగర్‌లోకి వరద నీరు భారీగా వచ్చింది. ఇళ్లను చుట్టుముట్టింది. ఆలమూరు ప్రధానరహదారి నుంచీ రుద్రంపేట 4వ సచివాలయం, వికాస్ నగర్ ఏరియాలకు వెళ్లేందుకు ప్రజలు ఇబ్బందులుపడ్డారు. వరద నీరు విశ్వశాంతి నగర్‌లోని పలు ఇళ్లలోకి చేరడంతో బయటకు వచ్చేందుకు అవస్థలు పడ్డారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. విశ్వశాంతినగర్‌లోని డోర్ నంబర్ 5-12లో ఉంటున్న రమేష్ (32), లతాంజలి(27), రామాంజనేయులు(60), ఈశ్వరమ్మ(55), జస్విన్(6), రెండున్నరేళ్ల హస్విత, డోర్ నంబర్ 5-13లోని బ్రహ్మయ్య(37), శాంతమ్మ(65), సునీత(34), 15 నెలల వయసున్న మోక్షిత, మోక్షితనందను అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా తాళ్ల సాయంతో బయటకు తీసుకొచ్చారు. సహాయక చర్యల్లో జిల్లా అదనపు అగ్నిమాపక అధికారి లింగమయ్య, లీడింగ్ ఫైర్‌మన్ చిన్న వెంకటరాముడు, ఫైర్‌మెన్ ప్రకాష్‌నాయుడు, గంగాధర్, ప్రసాద్, బాలవెంకటయ్య, వెంకటనాయుడు, డీపీఓ రాఘవేంద్ర పాల్గొన్నారు.



బాధితులను వరద నీటి నుంచి బయటకు తెస్తున్న అగ్నిమాపక సిబ్బంది



విశ్వశాంతి నగర్‌లో ఇళ్ల చుట్టూ నీరు



అనంత శివారులో వంకను తలపిస్తున్న జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు



చెరువును తలపిస్తున్న రజక్ నగర్

రాప్తాడులో 9.4 సెంటీమీటర్ల వర్షపాతం

అనంతపురం అర్బన్: జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం వర్షం కురిసింది. అత్యధికంగా రాప్తాడు మండలంలో 9.4 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. యల్లనూరు 7.8, అనంతపురం 7.1, శింగనమల 6.0, బుక్కరాయసముద్రం 5.0, తాడిపత్రి 4.6, పెద్దవడుగూరు 4.1, నార్పల, యాడికి 4.0, కూడేరు 3.9, ఆత్మకూరు 3.1, పెద్దపప్పూరు 2.6, రాయదుర్గం 2.1, గార్లదిన్నె, ఉరవకొండ, కళ్యాణదుర్గం 2.0 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 1.6 సెంటీ మీటర్లలోపు వర్షపాతం నమోదైంది.

పంటనష్టం

యల్లనూరు మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో యల్లనూరు సమీపంలోని ఎర్రవంక, కట్టుకాలువ, నడిమివంక ఉధృతంగా ప్రవహించడంతో యల్లనూరు చెరువు నిండింది. చెరువు మరువ పారడంతో పాతపేటలోని 100 ఎకరాల్లో కోత దశలోని వరి పొలాల్లోకి వర్షపు నీరు చేరింది. యల్లనూరు, కృష్ణాపురం, పాతపల్లిలో 60 ఎకరాల్లో కోత కోసి ఆరబెట్టిన మొక్కజొన్న పంట వర్షపు నీటితో తడిసింది. యాడికి మండలం వేములపాడులో హెక్టారులో రూ.2 లక్షల విలువైన టమోటా పంటకు నష్టం వాటిల్లింది. ఆత్మకూరులో 1.6 హెక్టార్లల్లో రూ.4 లక్షల విలువైన అరటి పంటకు నష్టం వాటిల్లింది. శెట్టూరు మండలంలో హెక్టారులో రూ.1.5 లక్షల విలువైన అరటి పంట దెబ్బతింది. కంబదూరు మండలంలో 1.2 హెక్టార్లలో రూ.లక్ష విలువైన బీర పంట దెబ్బతింది.

రానున్న ఐదు రోజుల్లో వర్ష సూచన

బుక్కరాయసముద్రం: రానున్న ఐదు రోజుల్లో ఉమ్మడి జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ శాస్త్రవేత్త గుత్తా నారాయణస్వామి తెలిపారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పగటి ఉష్ణోగ్రతలు 28-30.4 డిగ్రీల సెల్సియస్, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 22-23.5 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 8-12 కి.మీ., వేగంతో వీచే అవకాశం ఉందన్నారు. గాలిలో తేమ ఉదయం పూట 84-87, మధ్యాహ్నం 58-80 శాతం నమోదయ్యే అవకాశం ఉందన్నారు. రానున్న ఐదు రోజుల్లో అనంతపురం జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. 25న 2.2 సెం.మీ.లు, 26న 0.52, 27న 0.10, 28న 0.40, 29న 0.25 సెం.మీ. వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో 25న 2.2 సెం.మీ., 26న ఒక సెం.మీ., 27న 0.5 సెం.మీ., 28న 0.12 సెం.మీ., 29న 0.17 సెం.మీ, వర్షం కురిసే అవకాశం ఉందన్నారు.



పోతులనాగేపల్లి వద్ద ఉధృతంగా పారుతున్న చిత్రావతి నది

చిత్రావతి చిందులు

ధర్మవరం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోతులనాగేపల్లి వద్ద చిత్రావతి నది చిందులు తొక్కుతోంది. మూడురోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు కొత్తచెరువు, బుక్కపట్నం, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి వచ్చిన వర్షపునీరు చిత్రావతి నదికి చేరుతోంది. నది ఉధృతంగా ప్రవహి స్తుండటంతో చేపలు ఎక్కువగా వస్తున్నాయి. దీంతో గ్రామస్థులు ఉల్లాసంగా చేపలు పడుతూ కనిపించారు. నదీ ప్రవాహంతో పరివాహక ప్రాంతాల్లోని బోరుబావుల్లో నీరు పెరిగిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నది ఉధృతం గా ప్రవహిస్తుండటంతో పోతులనాగేపల్లి నుంచి కనంపల్లి గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

తెరుచుకున్న వైవీఆర్ గేట్లు

ముదిగుబ్బ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా సమీపాన ఉన్న యోగివేమన రిజర్వాయర్ (వైవీఆర్) పూర్తిగా నిండిపోవడంతో అధికారులు శుక్రవారం రెండు గేట్లు ఎత్తి, నీటిని నదికి వదిలారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 0.805 టీఎంసీలు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నిండిపోయింది. ఎగువ ప్రాంతాల నుంచి 1,688 క్యూసెక్కుల వరద జలాశయంలోకి వస్తోంది. దీంతో రెండు గేట్ల ద్వారా 1,688 క్యూసెక్కుల నీటిని మద్దిలేరుకు విడుదల చేసినట్లు ప్రాజెక్టు డీఈఈ రాజన్న తెలిపారు. దీంతో ముదిగుబ్బ-పులివెందుల రహదారిలో మద్దిలేరు వంక వద్ద రాకపోకలకు ఇబ్బంది కలిగింది. జలాశయం కింద ఉన్న దొరిగల్లు, ఇందుకూరు, నాగులగుబ్బల, నక్కలపల్లి, ఏబీ పల్లి, ఏబీ పల్లి తండా, మర్తాడు, బండ్లపల్లి, కొడవండ్లపల్లి గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



జలాశయం గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

బెల్టు కనిపిస్తే...

బైండోవర్ కేసు..!

- సురక్ష యాప్‌తో మద్యం విక్రయాల్లో పారదర్శకత
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

అనంతపురం క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త యాప్ సురక్ష స్కానర్ల ద్వారా జిల్లాలో మద్యం అమ్మకాలు పాదర్శకంగా జరుగుతున్నాయని ఎక్సైజ్ సూపరింటెండెంట్ (ఈఎస్) రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బెల్టు దుకాణాలు కనిపిస్తే.. బైండోవర్ కేసులు నమోదు చేయాలని సీఐలను ఆదేశించామని ఆయన స్పష్టం చేశారు. నాటుసారాను కట్టడి చేయడమేకాకుండా గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలను ప్రస్తావించారు.



ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం



ఆంధ్రజ్యోతి: జిల్లాలో నాటుసారా తయారీపై నిఘా పెట్టారా.. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఈఎస్: ఈ ఏడాది జనవరి నుంచీ అక్టోబరు 20వ తేదీ వరకూ నాటుసారాకు సంబంధించి 274 కేసులు నమోదు చేశాం. ఈ కేసుల్లో 244 మందిని అరెస్టు చేయడమేకాకుండా 8 వాహనాలు సీజ్ చేశాం. మరో 1,505 లీటర్ల నాటుసారా సీజ్ చేశాం. 27,575 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశాం.

ఆంధ్రజ్యోతి: ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం జిల్లాలోకి రాకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

ఈఎస్: ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా అక్రమ విక్రయాల కోసం దొడ్డిదారిన లిక్కర్ తరలించడం నేరం. ఎన్‌డీపీఎల్ లిక్కర్‌కు సంబంధించి 420 కేసులు నమోదు చేశాం. ఈ కేసులకు సంబంధించి 441 మందిని అరెస్టు చేశారు. 3,885 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నాం. 36 వాహనాలను సీజ్ చేశాం. అనధికార లిక్కర్‌కు సంబంధించి 550 కేసులు నమోదు చేసి, 557 మందిని అరెస్టు చేశాం. వారి నుంచీ 264 లీటర్ల అనధికార మద్యం స్వాధీనం చేసుకుని, 3 వాహనాలు సీజ్ చేశాం. కల్తీ కల్లును సైతం 249 లీటర్లు స్వాధీనం చేసుకున్నాం. 10 మందిని అరెస్టు చేశాం.

ఆంధ్రజ్యోతి: గంజాయి కట్టడిపై నిఘా పెట్టారా... ఇప్పటి వరకూ ఎంత మేర సీజ్ చేశారు?

ఈఎస్: జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, అమ్మకాలపై నిఘా పెట్టి, నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే 7 కేసులు నమోదు చేసి, 10 మందిని అరెస్టు చేశాం. ముద్దాయిల నుంచీ 13.47 కేజీలు స్వాధీనం చేసుకుని, సీజ్ చేశాం. గంజాయి ఎక్కడ కనిపించినా... కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్ష యాప్ ఏవిధంగా పనిచేస్తోంది.. అమ్మకాలు ఎలా సాగుతున్నాయి..?

ఈఎస్: మద్యం అమ్మకాలు పారదర్శకంగా సాగించేందుకు ఎక్సైజ్ సురక్ష యాప్ ఎంతగానో దోహదపడుతుంది. దుకాణదారులు మాత్రమే కాకుండా కస్టమర్లు సైతం యాప్ ను విరివిగా ఉపయోగిస్తున్నారు. యాప్ ద్వారానే జిల్లాలో ఈనెల 19న ఏకంగా రూ.2.59 కోట్లు, ఈనెల 20న రూ. 2.20 కోట్ల అమ్మకాలు జరిగాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు స్కాన్ చేసిన లిక్కర్ బాటిళ్లు మాత్రమే విక్రయించాలి.

ఆంధ్రజ్యోతి: బెల్టు షాపుల కట్టడికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఈఎస్: జిల్లాలో బెల్టు షాపులు ఎక్కడ కనిపించినా కఠిన చర్యలు తీసుకోవాలని అన్ని ఎక్సైజ్ స్టేషన్ల సీఐలను ఆదేశించారు. బెల్టు కనిపిస్తే.. బైండోవర్ కేసులు నమోదు చేయాలని ఇప్పటికే సూచనలు ఇచ్చాం. నిబంధనలు పాటించకుంటే... కఠిన చర్యలు తప్పవు.


బాధాకరం..



బస్సు ప్రమాదం బాధాకరం. ఈ ఘటన తీవ్రంగా కలవేసింది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం. ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలుగా సాయం చేస్తుంది, అండగా నిలుస్తుంది.

-వెంకటశివుడు యాదవ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వం అండగా ఉంటుంది..



బస్సు ప్రమాదం అత్యంత బాధాకరం. ప్రయాణికులు సజీవ దహనం కావడం దురదృష్టకరం. క్షతగాత్రులు త్వరగా కోలుకుంటారని ఆశిస్తున్నాను. మరణించిన వారి కుటుంబీకులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను.

- దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎమ్మెల్యే

అత్యంత బాధాకరం..



ప్రైవేట్ బస్సు దగ్ధమై ప్రయాణికులు మృతిచెందటం అత్యంత బాధాకరం. ప్రమాదం గురించి తెలియగానే హృదయం కలిచివేసింది. మృతుల కుటుంబాలకు సంతాపాన్ని తెలియజేస్తున్నాను. గాయపడ్డవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది.

- ఎంఎస్ రాజు, మడకశిర ఎమ్మెల్యే

మనోధైర్యంతో ఉండాలి..



బస్సు దుర్ఘటన అత్యంత విషాదకరం. భగవంతుడు ఆ కుటుంబాలకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ప్రభుత్వం బాధితులకు అండగా ఉంటుంది.

-గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ

హైవే వెహికిల్స్..!

(5వ పేజీ తరువాయి)

ఉంటుందని పేర్కొన్నారు.

పెరుగుతున్న వీకెండ్ జర్నీలు

ఉమ్మడి జిల్లాలో వీకెండ్ ప్రయాణాలు పెరుగుతున్నాయి. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, బీటెక్, ఎంబీబీఎస్ తదితర ఉన్నత విద్యను అభ్యసించేవారు వారాంతపు సెలవుల్లో స్వస్థలాలకు వచ్చి తిరిగి వెళుతుంటారు. వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఎక్కువగా బెంగళూరు, హైదరాబాద్ నడుమ ప్రయాణాలు సాగుతున్నాయి. ఈ మార్గంలో రాత్రిళ్లు హైవేపై ప్రైవేట్ ట్రావెల్ బస్సులు సర్రున దూసుకుపోతుంటాయి. చూసే వారికి ఒళ్లు గగుర్పొడిచేంత వేగంగా ప్రయాణిస్తుంటాయి. ఉమ్మడి జిల్లావాసులు బెంగళూరు-హైదరాబాద్, బెంగళూరు- అనంతపురం, హైదరాబాద్-అనంతపురం నడుమ ఎక్కువగా ప్రైవేట్ ట్రావెల్ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. రాత్రి పూట ప్రయాణానికి ఏసీ స్లీపర్ కోచ్ బస్సులను ఎంచుకుంటారు. కునుకుతీసి లేచేలోగా గమ్యస్థానంలో ఉండొచ్చని భావిస్తారు. వీరిద్వారా ట్రావెల్ నిర్వాహకులకు భారీగా ఆదాయం సమకూరుతోంది. బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు రూ.1200 వరకూ రూ.1500 వరకూ వసూలు చేస్తున్నారు. వీకెండ్స్, పండుగ పూట ఇది మరింత పెరుగుతుంది. బస్సుల రేటింగ్స్, ట్రావెల్స్ రేటింగ్స్ బట్టి రూ.4 వేల నుంచి రూ.5 వేల వరకూ వసూలు చేస్తారు. కానీ భద్రత విషయం గురించి పట్టించుకోవడం లేదు.

భద్రత ఉందా..?

అనంతపురం జిల్లాలో సుమారు 54 ప్రైవేట్ ట్రావెల్ బస్సులు నడుస్తున్నాయి. అనంతపురం నుంచి బెంగళూరు, హైదరాబాద్, చెన్నై తదితర ప్రాంతాలకు వీటిని నడుపుతున్నారు. ఇవికాక బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు చెందిన వందలాది బస్సులు జిల్లామీదుగా ప్రయాణిస్తాయి. వీటిలో భద్రతా ప్రమాణాల గురించి అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఓ అధికారులు ప్రైవేట్ బస్సులపై మే నెలలో 31 కేసులు, జూన్‌లో 46, జులైలో 30, ఆగస్టులో 20, సెప్టెంబరు 11, ఈ నెలలో ఇప్పటి వరకూ 26 కేసులు నమోదు చేశారు. పక్కాగా తనిఖీలు నిర్వహిస్తే మరిన్ని కేసులు నమోదవుతాయని ప్రయాణికులు అంటున్నారు.

బస్సు ప్రమాదం కలిచివేసింది

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి



తాడిపత్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం కలచివేసిందని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. టౌన్ బ్యాంక్‌లో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బస్సుల నిర్మాణంలో లోపంవల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని కొందరు మాట్లాడడం బాధాకరమని అన్నారు. తాము 1934 నుంచి బస్సులను నడుపుతున్నామని, దివాకర్ ట్రావెల్స్‌కు పేరు రావడంతోనే తాము ఈ స్థాయిలో ఉండగలిగామని అన్నారు. తమకు బస్సులంటే అమితమైన ప్రేమ అని, ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా కాపాడుకుంటామని అన్నారు. గతంలో ఆలిండియా పర్మిట్ విధానం ఉండేదని, దాన్ని రద్దు చేయడంతో బస్సులపై అవగాహన లేనివారు కూడా ట్రావెల్స్‌ను నడుపుతున్నారన్నారు. సింగిల్ విధానం అమలు చేస్తే ట్రావెల్స్ తగ్గుముఖం పడతాయని అన్నారు. గతంలో కేరళ, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వారే ఎక్కువగా నడిపేవారని, ప్రస్తుతం ట్యాక్స్‌లు పెరగడంతో నాగాలాండ్, అరుణాచల్‌ప్రదేశ్ నుంచే బస్సులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. సౌత్ ఇండియాలో బస్సుల నాణ్యత బాగుంటుందని, నార్త్ ఇండియాలో ప్రామాణికత సరిగా ఉండదని అన్నారు. గతంలో దివాకర్ ట్రావెల్స్ బస్సులు జబ్బార్ ట్రావెల్స్ వారికి లీజుకు ఇచ్చామని, అప్పట్లో దగ్ధమైన బస్సు తమ పేరిట ఉన్నందున చనిపోయినవారి కుటుంబాలకు పరిహారం చెల్లించామని అన్నారు.


దిగ్భ్రాంతికి గురి చేసింది..



బస్సు ప్రమాదం దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.

-లక్ష్మీనారాయణ, రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్మన్


అర్ధరాత్రి.. అతివేగం..



నేను పట్టుచీరల వ్యాపారం చేస్తుంటా. తరచూ వ్యాపారం నిమిత్తం విజయవాడ, హైదరాబాద్, బెంగళూరుకు వెళ్తుంటాను. ఎక్కువగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో ప్రయాణిస్తుంటాను. అర్ధరాత్రి బస్సులు అతివేగంతో ప్రయాణిస్తుంటాయి. దీనివల్ల మంచి నిద్ర సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. బస్సు కండిషన్ గురించి అధికారులు, యజమానులు పట్టించుకోవడం లేదు. వేగ నియంత్రణపై దృష్టి పెట్టాలి. లేదంటే ప్రమాదాలు కొనసాగుతాయి.

-జింకా పురుషోత్తం, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

ఓవర్ టేక్‌తోనే ప్రమాదాలు..



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాను. వారాంతపు సెలవుల్లో స్వగ్రామానికి వచ్చి వెళుతుంటాను. ప్రైవేటు బస్సులలో టిక్కెట్ ధర ఎక్కువ. కానీ అందుకు తగ్గట్టు వసతులు, భద్రత ఉండవు. ఓవర్ టేక్ చేసే క్రమంలో అతివేగంగా బస్సులు నడుపుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి, ప్రయాణికుల భద్రతకు చర్యలు చేపట్టాలి.

-ప్రకాశ్, కొత్తచెరువు

వెనుకవైపు ద్వారం ఉండాలి..

దూరప్రాంతాలకు రాత్రిపూట ప్రయాణించే ఓల్వో బస్సులకు వెనుకవైపు కూడా డోర్ ఏర్పాటు చేయాలి. బస్సులోకి ఎక్కిన ప్రయాణికులకు ఎమర్జెన్సీ ద్వారం ఎక్కడుందో చూపించాలి. దాన్ని తెరిచే విధానం గురించి నేర్పించాలి. బస్సు తలుపుల వద్ద క్లీనర్ ఉండాలి. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ని ప్రయాణికుల టిక్కెట్‌తోపాటు అందించాలి. ఇద్దరు డ్రైవర్లు తప్పనిసరిగా ఉండాలి. బస్సుల కిందిభాగాన ఎక్కువ శాతం లగేజీతో నింపేసి ఉంటారు. అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే బస్సు మొత్తం మంటలు వ్యాపిస్తాయి.



- నాగలత, హిందూపురం

రైతు ప్రయోజనాలకే ప్రాధాన్యం

● హంద్రీనీవాకు నిధులిచ్చిన సీఎంకు కృతజ్ఞతలు ● హెచ్ఎల్ఎంసీకు 50టీఎంసీల నీరు రాబట్టాలి ● రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
● తారతమ్యాలు లేకుండా నీటి కేటాయింపులు: కలెక్టర్ ● ఐఏబీ సమావేశంలో పలు అంశాలపై ఎమ్మెల్యేల చర్చ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైతు ప్రయోజనాలకే తొలి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో సాగు నీటి సలహా మండలి (ఐఏబీ) సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐఏబీ చైర్మన్, కలెక్టర్ ఆనంద్ అధ్యక్షత న నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్‌కి నిధులు కేటాయించి పూర్తి చేసినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఉమ్మడి జిల్లా ప్రజలు, రైతాంగం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. వందరోజుల్లో హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి చేయడం అద్భుతమని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను అభినందించారు. టీబీ డ్యాంలో నీటి నిల్వ తగ్గినా హెచ్చెల్సీకి కేటాయించిన నీటిని తీసుకోవాలని, శ్రీశైలం డ్యాంనుంచి ఈ దఫా హంద్రీనీవాకు 50టీఎంసీల నీటిని రాబట్టడమే లక్ష్యంగా ఇంజనీర్లు పనిచేయాలని కోరారు. ప్రతి ఎకరాకు సాగునీరు అందించినప్పుడే రైతుల విశ్వాసాన్ని చూరగొనగలమన్నారు. సాగు చేసిన పంట ఇంటికి చేరే వరకు అన్నదాతకు అండగా ఉంటామన్నారు. నీటి కేటాయింపులు, నిర్వహణకు ఇంజనీర్లు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

● ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ 40ఏళ్ల కాలంలో ఎన్నడూ లేని విధంగా నీటి కేటాయింపులు జరగడంపై ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు సంతోషం వ్యక్తం చేయడం ఇదే తొలిసారన్నారు. ఇదంతా సీఎం చంద్రబాబు చొరవతోనే సాధ్యమైందని తెలిపారు. హంద్రీనీవాకు రూ.3800 కోట్లు నిధులు కేటాయించి కాలువ వెడల్పు, లైనింగ్ పూర్తి చేయడం చంద్రబాబుకు రైతులపై ఉన్న నిబద్ధత, అభిమానానికి నిదర్శనమని కొనియాడారు. నీటి క్యాలెండర్‌ను రూపొందించి ప్రతి ఏటా నిర్దిష్టమైన కార్యాచరణను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి దూర దృష్టితోనే ఉమ్మడి జిల్లాకు సాగునీరు అందుతోందని హర్షం వ్యక్తం చేశారు.

● కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యవసాయానికి హంద్రీనీవా కాలువ వెడల్పు అత్యవసరమని ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఈక్రమంలోనే నిధులు కేటాయించి, పనులు పూర్తి చేసిందన్నారు. ఇందుకోసం చొరవ చూపిన సీఎం చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కళ్యాణదుర్గంలోని చెరువులను హెచ్చెల్సీ హంద్రీనీవా నీటితో నింపాలని కోరారు.

● శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ ఎంపీఆర్ ఆధునికీకరణ, గేట్ల మరమ్మతులకు రూ.5.5కోట్లు నిధులు ఇచ్చి, ఆయకట్టుకు 150రోజులపాటు సాగునీటి సరఫరాకు సహకరించిన సీఎం చంద్రబాబు, ఆర్థికమంత్రికి నియోజకవర్గ రైతుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఇచ్చిన ఉత్తర్వుల మేరకు శింగనమల చెరువుకు ఒక టీఎంసీల నీరు ఇవ్వాలని కోరారు.

● తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నడూలేనివిధంగా తాడిపత్రి నియోజకవర్గానికి సాగు నీరు కేటాయించి, సరఫరా చేస్తున్న సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. సౌత్‌కెనాల్ మరమ్మతుకు అవసరమైన నిధులు కేటాయించి అదనంగా 20వేల ఎకరాల ఆయకట్టు సాగుకు సహకరించాలని కోరారు. శిథిలావస్థకు చేరిన డిస్ట్రిబ్యూటరీల పటిష్టం చేయాలని పేర్కొన్నారు.


ఐఏబీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

● అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని రుద్రంపేట, రూరల్, రాజీవ్‌కాలనీ, నారాయణపురం గ్రామ పంచాయతీలతో పాటు ఇతర పంచాయతీలకు తాగునీరు కేటాయించాలని కోరారు. నడిమివంక రక్షణ గోడ నిర్మాణానికి మైనర్ ఇరిగేషన్ ద్వారా నిధులు ఇవ్వాలన్నారు. వర్షాకాలంలో నడిమివంక ప్రభావంతో కాలనీల్లోకి నీరు చేరి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు.

● ఎమ్మెల్సీ శివరామిరెడ్డి మాట్లాడుతూ.. ఐఏబీ సమావేశం మూడు నెలలు ఆలస్యంగా నిర్వహించడంతో నీటి కేటాయింపులు, విడుదల తేదీల జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోందని తెలిపారు. పీఏబీఆర్ పూర్తి సామర్థ్యం 11.6టీఎంసీల నీటి నిల్వకు అవసరమైన భూసేకరణ వెంటనే చేపట్టాలన్నారు. అటు హెచ్చెల్సీ, ఇటు హంద్రీనీవాలకు కలిపి అదనంగా జిల్లాలో ఓ రిజర్వాయర్‌ను నిర్మించాలన్నారు. లస్కర్ పోస్టులను భర్తీ చేసి, ఇరిగేషన్‌కు నిధులు కేటాయింపులు పెంచాలన్నారు. హంద్రీనీవా వెడల్పు, లైనింగ్‌కు నిధులు కేటాయించి పూర్తి చేయడం అభినందనీయమన్నారు.

● జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ మాట్లాడుతూ కాలువల మీద విధులు నిర్వహించి, నీటిని కాపాడే లస్కర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. కాలవల నుంచి నీరు వృథా కాకుండా అరికట్టి, రైతుల పంటలను కాపాడాలని తెలిపారు.

● జిల్లా కలెక్టర్, ఐఏబీ చైర్మన్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులు అయిన హంద్రీనీవా, హెచ్చెల్సీ ప్రాజెక్టుల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. ఇంజనీర్లతో సమీక్ష నిర్వహించి నీటి కేటాయింపులలో ఎటువంటి తారతమ్యాలు లేకుండా లెక్కలు సరిచేస్తామని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, రైతుల ప్రయోజనాల కోసం అధికారులను సమన్వయం చేసుకుని ముందుకెళ్తామని తెలిపారు.

● జలవనరుల ప్రాజెక్టుల సీఈ నాగరాజు, హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్, హెచ్చెల్సీ ఎస్ఈ సుధాకర్ రావు, టీబీ డ్యాం ఎస్ఈ నారాయణనాయక్‌లు నీటి కేటాయింపులు, విడుదల తేదీలతో పాటు చేసిన పురోగతి పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్చెల్సీ ప్రాజెక్ట్ చైర్మన్ జోగిరెడ్డి, మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి, హంద్రీనీవా, హెచ్చెల్సీ ఎంఐ ఈఈలు, డీఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.


ఐఏబీ సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

క్రైం కార్నర్

అప్పుల మగ్గానికి మరో నేతన్న బలి


నాగరాజు (ఫైల్)

బత్తలపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అప్పుల మగ్గం నేతన్నలను కబళిస్తోంది. గురువారం ధర్మవరంలో చేనేత కార్మికుడు రాజేశ్ మగ్గానికి ఉరేసుకున్న ఘటనను మరువకనే తాజాగా మండలంలోని పోట్లమర్రిలో నాగరాజు (30) మగ్గానికి వేలాడాడు. అప్పుల బాధ భరించలేక శుక్రవారం తెల్లవారుజామున ఉరేసుకుని, మరణించాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగరాజు సొంత మగ్గం నేసుకుంటూ జీవనం సాగించేవాడు. మగ్గం గిట్టుబాటు కాక అప్పులపాలయ్యాడు. వాటి ని ఎలా తీర్చాలోనని ఆవేదన చెందుతుండేవాడు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి భారీ వర్షం కురుస్తుండడంతో భార్య లక్ష్మి, కుమారులు మణికంఠ, గణేష్.. అదే ఊరిలోని అత్తగారి ఇంటికి పంపాడు. తెల్లవారుజామున ఇంట్లోనే మగ్గానికి ఉరేసుకున్నాడు. కుమారులు మణికంఠ, గణేష్ వచ్చి తలుపులు కొట్టగా ఎంతసేపటికీ తీయలేదు. వారు వెళ్లి తల్లి లక్ష్మికి విషయం తెలిపి బంధువులతో కలిసి వచ్చారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా నాగరాజు మగ్గానికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నేతన్న భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

మోసగించిన ప్రేమికుడి అరెస్ట్

శింగనమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను ప్రేమ పేరుతో మోసగించిన యువకుడిని శింగనమల పోలీసులు అరెస్టు చేశారు. శింగనమల పోలీస్‌స్టేషన్‌లో అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయ్‌కుమార్ శుక్రవారం విలేకరుల సమావేశంలో యువకుడి అరెస్టు వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ మండలంలోని సోదనపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువకుడు హరిప్రసాద్ అలియాస్ హర్షవర్ధన్ మాయమాటలతో బాలికకు దగ్గరయ్యాడు. ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఆమెను మోసం చేశాడు. దీనిపై బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు శుక్రవారం ఆ యువకుడిని అరెస్ట్ చేసి రిమాండుకు తరలించారు.

హత్య కేసులో జీవిత ఖైదు

అనంతపురం క్రైం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన బోయ రాజశేఖర్‌కు జీవిత ఖైదు పడింది. మరో రూ.2 వేలు జరిమానా కూడా విధిస్తూ అనంతపురం ఫస్ట్ అడిషనల్ జ్యుడిషియల్ కోర్టు న్యాయాధికారి సత్యవాణి శుక్రవారం తీర్పు వెలువరించారు. కళ్యాణదుర్గం మండలం మారంపల్లి కాలనీకి చెందిన తలారి నాగరాజు, తన స్నేహితులైన చాకలి అంజి, బోయ రాజశేఖర్‌తో కలిసి 2020 జులై 19న జూదం ఆడుతూ డబ్బు విషయంలో గొడవపడ్డారు. బోయ రాజశేఖర్ దాడి చేయడంతో తలారి నాగరాజు తీవ్రంగా గాయపడి అపస్మారకస్థితిలో పడిపోయాడు. బాధితున్ని అనంతపురం జీజీహెచ్‌కు తరలించగా, మరుసటి రోజు మరణించాడు. మృతుడి భార్య తలారి ఉష ఫిర్యాదు మేరకు అప్పటి కళ్యాణదుర్గం రూరల్ సీఐ శివశంకర్ నాయక్ దాడి చేసిన బోయరాజశేఖర్‌పై హత్య కేసు నమోదు చేశారు. తర్వాత సీఐగా వచ్చిన తేజోమూర్తి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. సుమారు 10 మంది సాక్షులను విచారించగా, నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో న్యాయాధికారి బోయ రాజశేఖర్‌కు యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.2 వేలు జరిమానా విధించారు.


ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు

గార్లదిన్నె, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ డ్రైవర్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా తెలిపారు. పామిడి మండలం పాళ్యం గ్రామానికి చెందిన అశోక్ గార్లదిన్నెలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గార్లదిన్నె సమీపంలోని ఓ గ్రామంలో బాలికపై లైంగిక దాడి చేశాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో శుక్రవారం తలగాసిపల్లి జంక్షన్ వద్ద ఉన్న అశోక్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్యంతో ఇద్దరు జవాన్ల మృతి


అమర్‌నాథ్ (ఫైల్)

పెద్దవడుగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనారోగ్యంతో బాధపడుతూ ఇద్దరు జవాన్లు శుక్రవారం మృతిచెందారు. పెద్దవడుగూరు మండలంలోని అప్పేచర్ల గ్రామానికి చెందిన సీఐఎస్ఎఫ్ జవాను అమర్‌నాథ్ (42) అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి చేరుకోగా.. తీవ్ర తలపోటు రావడంతో కుటుంబ సభ్యులు డిఫెన్స్ ఆస్పత్రికి తరలించారు. తలలో రక్తనాళాలు గడ్డ కట్టడంతో గురువారం రాత్రి మరణించారు. శుక్రవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జవాను మృతదేహం వద్ద తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి నివాళులు అర్పించారు. జవానుకు భార్య సుకన్య, కుమారుడు తిమ్మిస్, కుమార్తె దీపిక ఉన్నారు.


శామ్‌ప్రసాద్ (ఫైల్)

పెనుకొండ రూరల్: మండలంలోని శెట్టిపల్లికి చెందిన జవాను శ్యామ్‌ప్రసాద్(35) శుక్రవారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శెట్టిపల్లి గ్రామానికి చెందిన వెంకటనారాయణ, లక్ష్మీదేవమ్మల పెద్దకుమారుడు వెంకటనాయుడు జమ్మూ కశ్మీర్‌లో బీఎస్ఎఫ్ జవాన్‌గా పనిచేస్తున్నాడు. చిన్న కుమారుడు శ్యామ్‌ప్రసాద్ ఆర్మీలో పంజాబ్‌లో పనిచేస్తున్నాడు. సెప్టెంబరు 6న దసరా పండగకు శెట్టిపల్లికి వచ్చాడు. అక్టోబరు 6న తిరిగి విధుల్లో చేరాడు. వారం రోజుల కిందట జ్వరం రాగా పంజాబ్‌లోని జలంధర్ ఆర్మీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించి శుక్రవారం మధ్యాహ్నం 12.30కు మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.మృతుడికి భార్య శ్రావణి, ఇద్దరు కుమారులున్నారు.

కూతురిపై తల్లి విజయం

ఆదరించనందుకు భూమిని తిరిగి పొందిన లక్ష్మమ్మ

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి.. భూమిని రాయించుకుని.. ఆ తర్వాత పట్టించుకోని కూతురిపై అమ్మ గెలిచింది. దాన విక్రయం కింద కూతురికి రాసిచ్చిన భూమిని రెవెన్యూ కోర్టు ద్వారా తిరిగి పొందింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని లోనికోటకు చెందిన గుంజర లక్ష్మమ్మకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. రెండో కుమార్తె లక్ష్మీదేవికి 596-1 సర్వే నంబరులో 59.50 సెంట్ల స్థలాన్ని లక్ష్మమ్మ దాన విక్రయం చేసింది. కొన్ని రోజులు లక్ష్మీదేవి.. తల్లిని బాగా చూసుకుంది. ఆ తరువాత పట్టించుకోలేదు. దీంతో లక్ష్మమ్మ తీవ్ర ఇబ్బందులు పడింది. ఆర్డీఓ కోర్టులో ఈ ఏడాది ఫిబ్రవరి 5వ తేదీన ఫిర్యాదు చేసింది. దానిని సీరియస్‌గా తీసుకున్న ఆర్డీఓ మహేశ్.. లక్ష్మమ్మ కుటుంబ సభ్యులతో పలుమార్లు విచారణ చేపట్టారు. లక్ష్మమ్మను కుమార్తె లక్ష్మీదేవి ఇబ్బందులు పెట్టింది వాస్తవమేనని తేలింది. దీంతో కుమార్తె లక్ష్మీదేవికి దాన విక్రయం చేసిన స్థలాన్ని రెవెన్యూ కోర్టుద్వారా తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ సీనియర్ సిటిజన్ చట్టం ప్రకారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆర్డీఓ తెలిపారు. అందుకు సంబంధించిన ఉత్తర్వులను శుక్రవారం లక్ష్మమ్మకు అందజేశారు.


స్థలాన్ని తిరిగి లక్ష్మమ్మకు అప్పగిస్తూ ఉత్తర్వులు అందజేస్తున్న ఆర్డీఓ

చిలకం మధుకి భద్రత కల్పించండి

● పోలీసులకు హైకోర్టు ఆదేశం

ధర్మవరం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి భద్రత (1+1) కల్పించాలని గురువారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. చిలకం మధుసూదన్‌రెడ్డి కుటుంబ నేపథ్యం, రాజకీయ హోదాను దృష్టిలో ఉంచుకుని 2020 జూలై 22న ప్రభుత్వం (1+1) భద్రత కల్పించింది. తరువాత రాజకీయ కక్షతో అదే ఏడాది సెప్టెంబరు 15న భద్రతను తొలగించారు. అప్పట్లో హైకోర్టును ఆశ్రయించగా.. ప్రభుత్వం భద్రతను కొనసాగించాలని ఆదేశించింది. తరువాత రాజకీయ కక్షతో 2021 నవంబరు 23న భద్రతను తొలగించారు. దీంతో భద్రతను కొనసాగించేలా పోలీసులను ఆదేశించాలని చిలకం మధుసూదన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించి, దాఖలు చేశారు. గురువారం ఈ కేసు విచారణ చేపట్టిన జస్టిస్ డాక్టర్ వెంకటజ్యోతిర్మయ ప్రతాప ఆధ్వర్యంలోని ఏకసభ్య ధర్మాసనం చిలకం మధుసూదన్‌రెడ్డికి (1+1) వ్యక్తిగత భద్రత కల్పించాలని పోలీసులను ఆదేశించారు. చిలకం మధుసూదన్‌రెడ్డి జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

గుంతకల్లు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం నవంబరు, డిసెంబరు నెలల్లో గుంతకల్లు మీదుగా బెంగళూరు-బీదర్ మధ్య వారానికి రెండు రోజుల (బైవీక్లీ) ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు ప్రకటనలో తెలిపారు. బెంగళూరు-బీదర్ (06539) ప్రత్యేక రైలును నవంబరు 2 నుంచి డిసెంబరు 28 వరకూ శుక్ర, ఆదివారాలలో 17 ట్రిప్పులను నడుపుతామన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (06540)ను నవంబరు 3 నుంచి 29 వరకూ ప్రతి శని, సోమవారాల్లో 17 ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. ఈ రైలు యలహంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, క్రిష్ణా, యాదగిరి, వాడి, షాహాబాద్, కలబురగి, హోమ్నాబాద్ స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు.

జవాబుదారీగా పని చేయాలి: డీఆర్ఎం

గుంతకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులు జవాబుదారీతనంతో పనిచేయాలని డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయ ఆవరణలో శుక్రవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విజిలెన్స్ ప్రతిజ్ఞ చేయించారు. నైతికతను కాపాడుకుంటూ విధులు నిర్వర్తించాలని డీఆర్ఎం సూచించారు.

ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్టును ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు శుక్రవారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు వివరాలను జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గాయత్రి, గంగమ్మ వెల్లడించారు. తెలిపారు. ఎంపికైన జట్టులో పృథ్వీరాజ్, జగదీష్, మహేష్, సింహాద్రి, తరుణ్‌సాయి, సాయివెంకట్, లక్ష్మీకళ్యాణ్, లక్ష్మీనారాయణ, వినోద్, అరవింద్‌రెడ్డి, జయవర్ధన్ చౌదరి, ప్రశాంత్, సాయి జస్విక్‌రెడ్డి, అక్షయసాగర్, సాయివినయ్, వరుణ్ ఉన్నారు. స్టాండ్‌బైలుగా జయచంద్ర, మోక్షిత్‌వర్మ, బానుశంకర్, అరవింద్, సతీష్‌రెడ్డి ఎంపికయ్యారు. వీరు నవంబరు 8, 9 తేదీల్లో గుంటూరు జిల్లా పిడుగురాళ్లలో జరిగే రాష్ట్ర సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ ప్రభాకర్, ప్లేయర్ నాగేంద్ర పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు ఆర్థిక చేయూత

పుట్టపర్తిరూరల్/కొత్తచెరువు అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): సుకన్య సమృద్ధియోజన ద్వారా పేద విద్యార్థినులకు ఆర్థిక చేయూత అందించనున్నట్లు డీఈఓ క్రిష్టప్ప శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందుకోసం శ్రీసత్యసాయిజాతీయసేవా ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ శశిబాల ఆధ్వర్యంలో ఖాతాలు తెరవడానికి చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ఎస్సీ ఎస్టీ బీసీ పేద విద్యార్థినులను గుర్తించి వారిఖాతాల్లో కొంతమేర సొమ్మును ప్రభుత్వం జమ చేయనున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, తపాలా సిబ్బందికి విద్యార్థినుల (పదేళ్లలోపు బాలికలు) ఆధార్, తరగతి వివరాలను అందచేయాలన్నారు.

రేపు వాల్మీకి, బోయ టీచర్లకు సత్కారం

అనంతపురం విద్య, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో ఉద్యోగాలు సాధించిన వాల్మీకి, బోయ టీచర్లకు ఈనెల 26న ఆత్మీయ సత్కారం ఏర్పాటు చేసినట్లు వాల్మీకి ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అక్కులప్ప, ప్రధాన కార్యదర్శి చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్ తెలిపారు. సంఘం కార్యాలయంలో శుక్రవారం వారు మీడియాతో మాట్లాడుతూ తీవ్ర పోటీ ఉన్న డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఉద్యోగాలు సాధించడం వాల్మీకి బిడ్డలందరికీ స్ఫూర్తి దాయకమన్నారు. అందుకే వాల్మీకి కులబంధువుల సమక్షంలో సత్కరించాలనే ఈ ఆత్మీయ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోమ్‌లో ఉదయం 10గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఏడాదికో దూడ చాలు

● పాడి రైతులకు జేడీ సూచన

శింగనమల, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): ఏడాదికో దూడ అనే నియమాన్ని పాటిస్తే పశువులు ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా పశు సంవర్ధక శాఖ సంయుక్త సంచాలకుడు (జేడీ) ప్రేమ్‌చంద్ సూచించారు. దూడలు కూడా బాగా ఎదుగుతాయన్నారు. మండలంలోని చిన్నజలాలపురం గ్రామంలో శుక్రవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధి చికిత్స శిబిరం నిర్వహించారు. జేడీ ప్రేమ్‌చంద్ మాట్లాడుతూ.. పాడిరైతులు తమ పశువులు ఈనిన 60 రోజుల్లోపే తిరిగి కట్టించాలని చూస్తున్నారన్నారు. తద్వారా పాల ఉత్పత్తి తగ్గిపోతుందన్నారు. ఎస్ఎస్ఎస్ వీర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామనీ, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్, రమేష్‌రెడ్డి, పద్మనాభయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నత్తల నివారణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అమడగూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహమ్మదాబాద్ సమీపంలోని గొల్లపల్లి పరిధిలో నత్తల నివారణకు అధికారులు కదిలారు. అవి పంటలను దెబ్బతీస్తున్న విధానంపై 'నత్తల దండు' శీర్షికన గురువారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం అధికారుల్లో చలనం తెచ్చింది. శుక్రవారం ఉద్యాన శాఖాధికారి లావణ్య ఆధ్వర్యంలో పొలాలను పరిశీలించారు. నత్తల నివారణకు 250 గ్రాముల కాపర్ సల్ఫేట్, ఫెర్రస్ సల్ఫేట్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి, ఎకరానికి పిచికారీ చేయించారు. ఈ ద్రావణానిన డ్రిప్ ద్వారా కూడా సరఫరా చేసుకోవచ్చని ఉద్యాన శాఖాధికారి సూచించారు. పొలం చుట్టూ రాళ్ల ఉప్పు వేస్తే పంటలోకి న త్తలు చొరబడకుం డా నివారించవచ్చన్నారు. పొలం చుట్టూ బొప్పాయి మొక్కలు పెంచితే వీటి ప్రభావం పంటపై ఉండదన్నారు. పంటలో కొన్నిచోట్ల బొప్పాయి ఆకులను ఏర్పాటుచేస్తే నత్తలను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఓ వెం కటరమణాచారి, సిబ్బంది బా బ్‌జాన్, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వెంకటేష్, రవి పాల్గొన్నారు.

క్యాంపు రాజకీయం..!

బీకేఎస్ ఎంపీపీపై అవిశ్వాసం నేపథ్యంలో ఉత్కంఠ

వైసీపీ శిబిరానికి ఓ ఎంపీటీసీ డుమ్మా

ఓ సభ్యుడి కిడ్నాప్ కలకలం..!

బుక్కరాయసముద్రం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. శిబిరానికి ఓ ఎంపీటీసీ గైర్హాజరవడం, మరో సభ్యుడిని కిడ్నాప్ చేశారంటూ ప్రచారం నేపథ్యంలో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఎంపీపీ పీఠం దక్కించుకునేందుకు ఇటు వైసీపీ సమన్వయకర్త సాకే శైలజానాథ్, ఇటు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ నెల 30న బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీతపై వైసీపీ నేతలు అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టనున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ క్యాంపు రాజకీయాలకు తెరలేపింది. ఇప్పటికే 12 మంది వైసీపీ ఎంపీటీసీ సభ్యులను శిబిరానికి తరలించినట్లు సమాచారం. మద్దతు కూడగట్టేందుకు వైసీపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.

13 మంది మద్దతు అవసరం

మండలంలో మొత్తం 19 ఎంపీటీసీ స్థానాలున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే 13 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్నికల్లో 14 ఎంపీటీసీ స్థానాలను వైసీపీ గెలుచుకుంది. అప్పటి ఎమ్మెల్యే పద్మావతిపై అసంతృప్తితో ఎంపీపీ సునీత.. ఎన్నికలకు ముందు టీడీపీలోకి చేరారు. అందుకు టీడీపీ శ్రేణులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమెతో పార్టీకి సంబంధంలేదని టీడీపీ జోనల్ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర ఎన్నికలకు ముందు ప్రకటించారు. అయినా ఆమె.. పార్టీలో పరోక్షంగా పనిచేశారు. దీంతో ఆమెను కొనసాగించేందుకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పట్టుబట్టారు. వైసీపీ సభ్యులు 13 మంది ఉన్నారు. టీడీపీ సభ్యులు ఐదు



గురు, ఎంపీపీతో కలిసి బలం ఆరుకి చేరుతుంది. ఎంపీపీ సునీతను టీడీపీకి చెందిన కొందరు ఎంపీటీసీలు వ్యతిరేకిస్తున్నట్లు సమాచారం. సునీత కాకుండా వేరెవ్వరికైనా మద్దతు ఇస్తామని ఒకరిద్దరు చెబుతున్నట్లు తెలుస్తోంది. బుక్కరాయసముద్రం వైసీపీ ఎంపీటీసీ-3 శిరిజ ఆ పార్టీ శిబిరానికి డుమ్మా కొట్టారు. ఆమె ఆచూకీ కోసం వైసీపీ నేతలు తీవ్ర ప్రయత్నాలు చేశారు. 30న జరిగే సమావేశానికి గైర్హాజరు చేసేందుకు ఎంపీపీ దాసరి సునీత తీవ్ర పయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వైసీపీ ఎంపీటీసీలను కలిసి, మద్దతు కోరినట్లు సమాచారం.

కిడ్నాప్ కలకలం

మండలంలోని కేకే అగ్రహారం ఎంపీటీసీ రామచంద్రను కిడ్నాప్ చేసినట్లు గురువారం రాత్రి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అప్రమత్తమైన సీఐ పుల్లయ్య, సిబ్బంది ఎంపీటీసీ రామచంద్రను స్టేషన్‌కు పిలిపించి, విచారించారు. రాత్రి 12 గంటల వరకు స్టేషన్‌లో విచారణ చేయడంతో వైసీపీ శిబిరంలో ఆందోళన మొదలైంది. తిరిగి వైసీపీ ముఖ్యనేతలు.. రామచంద్రతో మాట్లాడారు. అనంతరం తనను కిడ్నాప్ చేయలేదని రామచంద్ర చెప్పడంతో పోలీసులు పంపించేశారు. వైసీపీ శిబిరంలోకి వెళ్లినట్లు తెలిసింది.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజుల పాటు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో శుక్రవారం ఆయన నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామితో కలిసి భారీ వర్షాలు, నగరంలో పరిస్థితులపై ఏఎంసీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మరో రెండు రోజులపాటు నగరంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏఎంసీ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. ముఖ్యంగా నడిమివంక, మరువవంక, నగర శివారు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి సహాయ చర్యలు చేపట్టాలన్నారు. వంక పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ లోపించిందని, అనేక ఫిర్యాదులు వస్తున్నాయని, శానిటేషన్ సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకోవాలని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఎస్‌ఈ రాజశేఖర్, ఈఈ చంద్రశేఖర్, ఎంహెచ్‌ఓ నరసింహులు, డీఈలు, ఏఈలు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విశ్వశాంతి నగర్‌లో పర్యటన

అనంతపురంరూరల్: భారీ వర్షాలకు ముంపునకు గురైన రుద్రంపేట పంచాయతీలోని విశ్వశాంతి నగర్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పర్యటించారు. అధికారులు, స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కాలనీ మొత్తం తిరిగారు. అక్కడ ఎంత మేర నీరు వచ్చింది. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారన్నది ఆరా తీశారు. వచ్చే రెండు రోజుల్లో భారీ వర్షాలున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని కాలనీవాసులకు సూచించారు. ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ.. 2022లో నగరంలో భారీ వర్షం వచ్చి చాలా కాలనీలు నీట మునిగాయన్నారు. అప్పట్లో కొందరు వైసీపీ నాయకులు ఆక్రమణల వలన ఇబ్బందులు వచ్చాయన్నారు. వంకల్లో ఎక్కడా పూడిక తీయకపోవడం వలన కాలనీల్లోకి నీరు వచ్చిందన్నారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరిస్తున్నామన్నారు. వచ్చే వర్షాకాలానికి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని తెలిపారు.


విశ్వశాంతి నగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రభుత్వానికి మంచి పేరు తేవాలి

- రామగిరి పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లకు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన
- అట్టహాసంగా ప్రమాణ స్వీకారం

రామగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రామగిరి పీఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్లు బాధ్యతగా పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. మండలకేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ సమీపంలో శుక్రవారం చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ఆమె సమక్షంలో చైర్మన్‌గా ముత్యాలు, డైరెక్టర్లుగా నాగరాజు, చంద్రాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం వారికి ఎమ్మెల్యే అభినందనలు తెలిపి మాట్లాడారు. బాధ్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రైతులకు సకాలంలో రుణాలు, ఎరువులు అందించాలన్నారు. ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. రుణాల విషయంలో గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలు పునరావృతం కాకూడదన్నారు. తర్వాత చైర్మన్, డైరెక్టర్లు ఎమ్మెల్యేను, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్.నారాయణ చౌదరి, రామ్మూర్తినాయుడు, రంగయ్యను సత్కరించారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

రామగిరి ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత మండలానికి సంబంధించిన అన్నిశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులు, ప్రజాసమస్యలపై చర్చించారు. పలు శాఖల అధికారులు సరైన వివరాలతో రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మాట్లాడుతూ మండలంలోని భూవివాదాలు, సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. రికార్డులు సరిగా లేని భూములపై చర్చించి వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సోలార్ ప్రాజెక్టుల కోసం సాగులో లేని భూములను సేకరించాలని తెలిపారు.


ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న పరిటాల సునీత, ఎల్ నారాయణ చౌదరి తదితరులు

సౌకర్యాలు మెరుగు పరచాలి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రైల్వే ప్రయాణికులకు సౌకర్యాలు మరింత మెరుగుపరచాలని పలువురు ప్రయాణికులు డివిజన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక రైల్వేస్టేషన్‌లోని స్టేషన్ మేనేజర్ చాంబర్‌లో శుక్రవారం మేనేజర్ అశోక్‌కుమార్‌తో కలిసి గుంతకల్లు డివిజన్ నుంచి వచ్చిన సీనియర్ డీసీఎం మనోజ్, సీనియర్ డీఈఎన్ జీబీఎస్ శ్రీనివాస్, పలువురు అధికారులు కలిసి ప్రయాణికులతో సమావేశమై పలు వివరాలు సేకరించారు. అందులో పలువురు ప్రయాణికులు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను అధికారులకు వివరించారు. ప్రధానంగా పలు రైళ్లకు అదనపు బోగీలు ఏర్పాటు చేయాలని, అమరావతికి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రైళ్లు నడపాలని కోరారు. స్పందించిన అధికారులు సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

యాక్షన్ ప్లాన్‌పై సమాలోచనలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి ధన ధాన్య వికాస్ యోజన అమలుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయడంపై వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు సమాలోచనలు జరిపారు. స్థానిక వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్‌చంద్, ఉద్యాన శాఖ ఏడీ దేవానంద్, ఇతర అనుబంధ శాఖల అధికారులు తమ తమ శాఖల పరిధిల్లో యాక్షన్ ప్లాన్‌లో పొందుపర్చాల్సిన పథకాలు, కావాల్సిన బడ్జెట్ తదితర అంశాలపై చర్చించారు.

'పేదలకు ప్రభుత్వ భూములు పంచాలి'

నార్పల,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో అటవీ, బంజరు, ప్రభుత్వ పోరంబోకు భూములు అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను గుర్తించి పేద ప్రజలకు దక్కేవిధంగా చూడాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి టీ.నారాయణస్వామి, జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి పెదయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి సమావేశంలో వారు ఈ మేరకు మాట్లాడారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి నారాయణస్వామి, నియోజకవర్గ అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతానికి చర్యలు

అనంతపురం అర్బన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల బలోపేతం కోసం తగు చర్యలు తీసుకోనున్నట్లు ఉద్యాన శాఖ జిల్లా అధికారి ఉమాదేవి పేర్కొన్నారు. స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం ఆమె ఏడీ దేవానంద్, ఆగ్రోలైఫ్ సైన్‌సెస్ కంపెనీ డిప్యూటీ జనరల్ మేనేజర్ ప్రసాద్‌తో కలిసి పలువురు రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు ఉత్పత్తిదారుల సంఘాల ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయించేలా చొరవ చూపుతామన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు లైసెన్స్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంత ఉద్యాన సమ్మేళనంలో ఒప్పందం కుదుర్చుకున్న ఆగ్రోలైఫ్ సైన్‌సెస్ కంపెనీ హోల్‌సేల్ కంటే తక్కువకే ఎఫ్‌పీఓలకు ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందించేందుకు అంగీకరించిందన్నారు. అవకాశాన్ని రైతు ఉత్పత్తిదారుల సంఘాల వినియోగించుకోవాలని సూచించారు.

నేడు విద్యుత్ అదాలత్

చెన్నేకొత్తపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎన్‌ఎస్‌గేటు విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో శనివారం విద్యుత్ అదాలత్‌ను నిర్వహించనున్నట్లు విద్యుత్ డీఈఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. పుట్టపర్తి డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శివరాములు ఆధ్వర్యంలో ఉదయం 10:30గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వినియోగదారులు ఏవైనా విద్యుత్ సమస్యలుంటే ఈ కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలి

అనంతపురంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలకు రెగ్యులర్ ప్రిన్సిపాళ్లను నియమించాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు ఐసా ఆధ్వర్యంలో విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఐసా రాష్ట్ర సహాయ కార్యదర్శి భీమేష్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు తరిమెల గిరి, వైఎస్సార్ ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ సభ్యులు శంకర్, ఐసా జాతీయ నాయకులు వేమన హాజరై మాట్లాడారు. ఆయా కళాశాలల్లో ఉన్న కాంట్రాక్ట్ ప్రిన్సిపాళ్ల వలన విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. యూనివర్సిటీ అధికారులు మాత్రం కాంట్రాక్టు ప్రిన్సిపాళ్లు ఇచ్చే కమీషన్లకోసం వారినే కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తక్షణం కాంట్రాక్టు ప్రిన్సిపాళ్లను తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపాళ్లగా నియమించాలన్నారు. నాయకులు దావీదు, వెంకటేష్, చలపతి, శ్రీరామ్, యశ్వంత్, సురేష్ పాల్గొన్నారు.

ట్రోఫీల ఆవిష్కరణ

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల ట్రోఫీ ఆవిష్కరించారు. ఈనెల 25వతేదీ నుంచి జరిగే 42వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన ట్రోఫీలు, పతకాలు, మెమొంటోలను శుక్రవారం తన కార్యాలయంలో ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25, 26వతేదీలలో అనంతపురంలోని జీసెస్‌నగర్‌లో గల జయమణెమ్మ కల్యాణమండపంలో 42వ ఏపీ జూనియర్ రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు శాంతరాజ్, రామాంజి, రాజేష్, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.


ట్రోఫీలను ఆవిష్కరిస్తున్న ఏడీసీసీబీ చైర్మన్ కేశవరెడ్డి, సభ్యులు

ప్రజల సహనానికి పరీక్ష పెట్టకండి: సీపీఎం


నడిమివంకలో దిగి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అనంతపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నడిమివంక, రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జిలకు సైడ్‌వాల్ నిర్మించాలని నగర ప్రజలు రోజుల తరబడి కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇక ప్రజల సహనానికి పరీక్ష పెట్టకండని సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి పేర్కొన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో వంకలు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించడం వల్ల ప్రజలకు ప్రమాదాలు వాటిల్లే అవకాశముందన్నారు. బ్రిడ్జి సైడ్‌వాల్ నిర్మించకపోవడం పట్ల నగరపాలక అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం సీపీఎం నాయకులు నడిమివంక మురుగునీటిలో దిగి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ... చిన్నపాటి వర్షం వచ్చినా వంకలకు సమీపంలోని కాలనీల్లో వందలాది కుటుంబాల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారన్నారు. అయినా అధికారులు, పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రజల సహనానికి పరీక్ష పెడుతున్నారని పేర్కొన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా నడిమివంక, రిషిత పబ్లిక్ స్కూల్ వద్ద బ్రిడ్జిలకు సైడ్‌వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు ప్రకాష్, వెంకటనారాయణ, నగర కమిటీ సభ్యులు రాజు, జీవ, గఫూర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఓతూరు పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్లేసిన్ సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రారంభం


సంస్థ ప్రారంభోత్సవంలో పాల్గొన్న జేఎల్ మురళీధర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక హౌసింగ్ బోర్డులో స్కిల్ డెవలప్‌మెంట్, జిల్లా ఉపాధి కల్పన శాఖల అనుబంధంగా ఏర్పాటైన క్లేసిన్ సాఫ్ట్‌వేర్ సంస్థను అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ శుక్రవారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు కరువు జిల్లాలో నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సంకల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ మహ్మద్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, సంస్థ డైరెక్టర్లు నామా వెంకట రాఘవేంద్రరెడ్డి, విక్రమ్‌చౌదరి, బుశిరెడ్డి, మంజునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

'మా భూముల కోసమే పోరాటం'

అనంతపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తమ భూమి కోసం లీగల్‌గా పోరాటం చేస్తామని రాచూరి వెంకటరమణ, వెంకట కిరణ్ అన్నారు. నగర శివారులోని ఓ హోటల్‌లో శుక్రవారం వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. పదిహేను రోజుల నుంచి పాపంపేట భూవివాదం తెరపైకి వచ్చిన విషం తెలిసిందేనన్నారు. తమకు హక్కుగా కలిగిన భూమి కోసం తాము ప్రయత్నం చేస్తున్నామన్నారు. అంతేగాని పాపంపేట ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం, ఇబ్బంది పెట్టాలన్నది తమ ఉద్దేశం కాదన్నారు. 2003 నుంచి తమ స్థలాల కోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. అప్పట్లో రాజకీయ పరమైన ఇబ్బందులు రావడంతో వెనుదిరగాల్సి వచ్చిందన్నారు. తమకు తెలిసిన న్యాయవాది సుభాష్‌రెడ్డిని కలిసి భూమికి సంబంధించిన విషయాలను వివరించామన్నారు. తద్వారా శ్రీరాములు, సుభాష్‌రెడ్డిలతో కలిసి భూమి సమస్య పరిష్కారంకోసం ప్రయత్నాలు చేస్తున్నామన్నారు.

చెత్త తొలగింపు


చెత్త తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న ఏఎంసీ కమిషనర్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నగరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తను తొలగించే పనిలో ఏఎంసీ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి నేతృత్వంలో జనశక్తినగర్, రంగస్వామినగర్, సోమనాథ్ నగర్, రజకనగర్, నడిమివంక, ఐదోరోడ్డు ప్రాంతాలలో ఎక్సవేటర్లతో తొలగింపు పనులు చేపట్టారు. చెత్తచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు, పిచ్చిమొక్కలను తొలగించడం, పేరుకు పోయిన బురదను తొలగించే పనులను కమిషనర్ పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులతో మురుగు కాలవలు, వీధులను శుభ్రం చేయించారు. అయితే భారీ వర్షాలకు నగరవాసులు నానా అవస్థలు పడుతున్నారు.

టైంస్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి


మంత్రి కేశవ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురంరూరల్,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పని చేస్తున్న టైం స్కేల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ యూనివర్సిటీస్ నాన్ టీచింగ్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు తిమ్మప్ప కోరారు. ఆమేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఎస్కేయూ నాన్‌టీచింగ్ ఉద్యోగులతో జిల్లాకేంద్రంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రిని శాలువాతో, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ నాగమునీంద్ర, ప్రధాన కార్యదర్శి మారుతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్ష్మినరసింహులు, టైం స్కేల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయుడు, వైస్ ప్రెసిడెంట్ శివయ్య, ప్రధాన కార్యదర్శి సంజీవప్ప, నాయకులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను పెంపొందించాలి

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించాలని, అవే పంచాయతీల అభివృద్ధికి ప్రథమమని జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్ పేర్కొన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో గల సమావేశ భవనంలో శుక్రవారం ఆయన డీపీఓ నాగరాజు నాయుడితో కలిసి ఉమ్మడి జిల్లాలోని డిప్యూటీ ఎంపీడీఓలకు, ఎంపీడీఓలకు శిక్షణ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంపొందించాలని, అవే పంచాయతీల అభివృద్ధికి ప్రథమమని తెలిపారు. దీ పంచాయితీల్లో ఏ విధంగా ఆదాయ వనరులను సమకూర్చుకోవాలనే దానికి ఈ శిక్షణ చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ శిక్షణను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని పంచాయతీల అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీడీఓ నాగశివలీల, ట్రైనర్ సౌజన్య పాల్గొన్నారు.

గొడవపై ఏడీఏ విచారణ

కనగానపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్నా భోజన నిర్వాహకులకు, టీచర్‌కు గొడవ జరిగింది. అది కాస్త ముదిరి ఉన్నాతాధికారులకు, పోలీసులకు ఫిర్యాదు వరకు వెళ్లింది. దీంతో ఏడీఏ వినయ్‌మోహన్ శుక్రవారం పాఠశాలలో పర్యటించి విచారణ చేపట్టారు. పాఠశాలలో హెచ్‌ఎం స్నేహలత సెలవుపై వెళ్లారు. దీంతో బయాలజీ టీచర్ ఎం నాగలక్ష్మికి వంట ఏజెన్సీ నిర్వాహకులకు గురువారం విద్యార్థులకు మధ్యాహ్నా భోజన విషయంలో గొడవ జరిగింది. ఈ సంఘటనపై సదరు టీచర్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సోషియల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఏడీఏ వినయ్‌మోహన్ పాఠశాలలో ఎంఈఓలు అరుణమ్మ, శ్రీదేవి ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు.

ఎంపీటీసీ సభ్యుడి మృతికి నివాళి

కనగానపల్లి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్లపల్లికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు పెద్దప్పయ్య గత గురువారం అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలిసిందే. డీసీఎంఎస్, మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, బోయపాటి సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మాజీ ఎంపీపీ యాతం ఆదినారాయణ, నాయకులు సరిపూటి ముకుందనాయుడు, శివశంకర్‌రెడ్డి, దేవరాజు, నారాయణస్వామి తదితరులు శుక్రవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ సరికాదు: ఏపీటీఎఫ్

అనంతపురంవిద్య, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ తప్పనిసరిచేసి షెడ్యూల్ ఇవ్వడం సరికాదని, దీనిపై ఉద్యమం కొనసాగిస్తామని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధ్యాయభవన్‌లో శుక్రవారం ఏపీటీఎఫ్ జిల్లాకార్యవర్గం నాయకులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ఉద్యోగం పొందినపుడు లేని షరతులు ఇప్పుడెందుకని ప్రశ్నించారు ఒక్కొక్కరు 30ఏళ్లుగా పనిచేసినవారున్నా ఇపుడు మళ్లీ టెట్ రాయాలని నిబంధన విధించడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే నిర్ణయంను విరమించుకోవాలన్నారు. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రూ.5 లక్షల చంద్రన్న బీమా మంజూరు

అనంతపురం క్రైం, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు టీడీపీ సభ్యత్వం భరోసా ఇస్తోందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. రామగిరి మండలం గంతిమర్రికి చెందిన టీడీపీ కార్యకర్త ముసలప్ప ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో.. చంద్రన్న బీమా కింద రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. ఆ ధ్రువీకరణ పత్రాన్ని ఎమ్మెల్యే అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం బాధితుడి కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంతోమంది కార్యకర్తలకు సభ్యత్వ నమోదు ఆసరాగా ఉంటోందని తెలిపారు.

పశువైద్యశాల తనిఖీ

నార్పల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నార్పల పశువైద్యశాలను పశుసంవర్ధకశాఖ జేడీ ప్రేమ్‌చంద్ శుక్రవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. అధికారులు సమయపాలన పాటించాలని.. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజలను ఇబ్బంది పెడితే సహించం: బీజేపీ

అనంతపురంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏ పార్టీ వారైనా సరే ప్రజలను ఇబ్బంది పెడితే సహించేదీ లేదని బీజేపీ నాయకులు హెచ్చరించారు. నగరంలో శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షులు కనకొండ్ల రాజేష్, రాష్ట్ర సేల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, మీడియా ప్యానలిస్ట్ వెంకటేశ్వర్‌రెడ్డి, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఓలేటి రత్నమయ్య, జిల్లా కార్యదర్శి రావిచైతన్య కిశోర్ తదితరులు పాపంపేట ప్రజలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. భూ కబ్జాదారులకు ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వ్యతిరేకమన్నారు. సామాన్య ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటివారినైనా భారతీయ జనతపార్టీ ఉపేక్షించదని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రూ.6 లక్షల గోల్‌మాల్‌పై విచారణ

శింగనమల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): శింగనమల రైతు ఉత్పాదక దారుల సంఘంలో ఇటీవల జరిగిన రూ.6లక్షల గోల్‌మాల్‌పై శుక్రవారం రైతు ఉత్పాదక దారుల సంఘం అధికారి రియాజ్‌బేగ్ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని రైతు ఉత్పాదదారుల కార్యాలయం రికార్డులు తనిఖీ చేసి అనంతరం బ్యాంకు అధికారుల వద్ద రూ.6లక్షలు ఎవరి ఖాతాలో జమ అయ్యాయో ఆరా తీశారు. అనంతరం రియాజ్‌బేగ్ మాట్లాడుతూ రూ.6లక్షలు అకౌంటెంట్ ఖాతాలో జమయ్యాయని, గోల్‌మాల్ అయిన రూ.6లక్షలను వారి కుటుంబ సభ్యులతో రికవరీ చేయడానికి పైఅధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

బీసీ కార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా రామసుబ్బారెడ్డి

అనంతపురంవిద్య, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): బీసీకార్పొరేషన్ ఇన్‌చార్జి ఈడీగా మైనార్టీ వెల్ఫేర్ శాఖ డైరెక్టర్ రామసుబ్బారెడ్డికి కలెక్టర్ ఆనంద్ బాధ్యతలు అప్పగించారు. ఇప్పటివరకు రెగ్యులర్ ఈడీగా ఉన్న సుబ్రహ్మణ్యం కార్పొరేషన్ నిబంధనల మేరకు 60ఏళ్లకే పదవీ విరమణ కావాల్సి ఉంది. ఆలెక్కన ఈఏడాది ఆగస్టులో ఆయన పదవీకాలం ముగిసింది. కానీ అతను 62ఏళ్లు సర్వీస్ కల్పించాలంటూ కోర్టును ఆశ్రయించగా.. అందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. అయినా కోర్టు ఆర్డర్‌పేరున రెండునెలలుగా అలాగే కొనసాగుతూ వచ్చారు. చివరకు ఆశాఖ ఎండీ ఆదేశాలమేరకు సుబ్రహ్మణ్యంను రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. అలాగే ఆ బాధ్యతలను రామసుబ్బారెడ్డికి అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. రామసుబ్బారెడ్డి శనివారం బాధ్యతలు చేపట్టనున్నారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతోనే సమస్యల పరిష్కారం

అనంతపురం టౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు తమ సమస్యలను శాస్త్రీయ పరిజ్ఞానంతోనే పరిష్కరించుకోవచ్చునని జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ ప్రసూన సూచించారు. జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక లక్ష్మీ సినర్జీ హైస్కూల్‌లో 'ఎదిగే ఆడపిల్లలు - ఎదుర్కొనే సమస్యలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమ్మాయిలు యుక్తవయసులో ఎవరికీ చెప్పుకోలేని అనేక సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని, అలాంటి సందర్భాల్లో అశాస్త్రీయమైన పాతపద్ధతుల్లో కాకుండా శాస్త్రీయ పరిజ్ఞానంతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రతి విషయంలో ఎంతో పరిపక్వతతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. అదే తమ ఎదుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. ప్రముఖ వైద్యురాలు నాగజ్యోతి, జేవీవీ నగర అధ్యక్ష కార్యదర్శులు తిరుపాలు, ప్రసాద్‌రెడ్డి, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆదర్శ స్కూల్లో ఫైన్ ఆర్ట్స్ పోటీలు

అనంతపురంవిద్య, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆదర్శస్కూల్‌లో గత గురువారం నుంచి శుక్రవారం వరకు నేషనల్ లెవల్ ఫైన్ ఆర్ట్స్ పోటీలు జరిగాయి. ఇందులో భాగంగా చేతిరాత, చిత్రకళ వంటిపోటీలు నిర్వహించారు. వాటి ల్లో ట్రిల్లీస్, గ్లోబుల్,ఎరా తదితర స్కూల్స్ నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఆ పోటీల్లో ధనుస్‌రెడ్డి ప్రథమబహుమతి, విష్ణుశ్రీజ ద్వితీయ బహుమతి, జోషికరెడ్డి తృతీయబహుమతి పొందారని టీచర్లు తెలిపారు.

టీబీ నియంత్రణపై సమీక్ష

అనంతపురం వైద్యం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీబీ నియంత్రణపై ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆ విభాగంలో శుక్రవారం జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ ఆఫీసర్ డాక్టర్ జయలక్ష్మి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో ఆమెతో పాటు స్టేట్ టీడీ కన్సల్టెంట్ డాక్టర్ రామ్‌కిషోర్ నివేదికలను ప్రజెంటేషన్ చేసి ఎస్‌టీఎస్, ఎస్‌టీఎల్‌ఎస్, టీబీహెచ్‌వీలతో వివరాలు ఆరాతీశారు. అనంతరం ఎస్‌టీఎస్‌లు, ఎస్‌టీఎల్‌ఎస్‌లు, టీబీహెచ్‌వీలు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు పరిశీలించాల్సిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్(ఎంఎల్‌హెచ్‌పీ)లు టీబీవ్యాధి అనుమానిత కేసులన్నీ కప్పిపెడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. లెప్రసీ ఆఫీసర్ డాక్టర్ గంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.

లా కళాశాలపై చర్యలు తీసుకోవాలని వినతి

అనంతపురంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):నిబంధనలు పాటించని విజయనగర లా కళాశాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఆమేరకు శుక్రవారం ఎస్కేయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అనితను కలిసి వినతి పత్రంఇచ్చారు. పలువురు మాట్లాడుతూ.. నగరంలోని విజయనగర లా కళాశాల కేవలం ధనార్జనే ధ్యేయంగా పేద విద్యార్థులను నిలువు దోపిడీ చేస్తోందన్నారు. రాష్ట్రంలోని విద్యార్థులకు కేవలం 20శాతం సీట్లు ఇచ్చి.. పొరుగు రాష్ట్రాల వారికి80శాతం సీట్లు కేటాయించి రూ. లక్షలు దండుకుంటోందన్నారు. యూనివర్సిటీ అధికారులు సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర యూనివర్సిటీల కన్వీనర్ ప్రసాద్, టీఎన్ఎస్ఎఫ్ రాజశేఖర్, జేఎన్‌యూ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

బాలకృష్ణ అభిమానుల సంబరాలు


కేక్ కట్ చేస్తున్న అభిమానులు

అనంతపురంక్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ సినిమా అఖండ-2 మరో అద్భుతమైన సినిమాగా నిలువబోతుందని బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు గౌస్ మొయిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక తన కార్యాలయంలో శుక్రవారం ఆయన నందమూరి అభిమానులతో కలిసి అఖండ-2 తాండవం బ్లాస్టింగ్ రోల్ వీడియో తిలకించారు. తర్వాత కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు.. బాలయ్య సినిమా సంక్రాంతికి ముందుగానే డిసెంబరు 5న రాబోతోందన్నారు. ఈ సినిమా భారీగా ప్రేక్షకులను అలరించనుందన్నారు. బాలయ్య నటన, డైలాగ్ డెలివరీ అదిరిపోయాయన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హైవే సర్వీసు రోడ్లు జలమయం

అనంతపురం రూరల్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): భారీ వర్షానికి హై వే సర్వీసు రోడ్లు జలమయమయ్యాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు భారీ వర్షం కురిసింది. దీంతో జిల్లా కేంద్రం సమీపంలో బెంగుళూరు-హైదరాబాదు జతీయ రహదారి సర్వీసు రోడ్లు వర్షపునీటితో నిండిపోయి మడుగులను తలపిస్తున్నాయి. స్థానికంగా వర్షపు నీరు వెళ్లేందుకు డ్రైనేజీ కాలువలు సరిగా లేకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. కక్కలపల్లి క్రాస్‌లో పైభాగంలో నుంచి వచ్చే నీరు వెళ్లేందుకు వీలు లేకపోవడంతో నీరంతా సర్వీసు రోడ్డుపై ఉండిపోయాయి. దీంతో వాహనదారులు ఇబ్బందుల పడాల్సిన పరిస్థితి నెలకొంది.


వంకను తలపిస్తున్న సర్వీస్ రోడ్డు

న్యూస్ బాక్స్

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

బొమ్మనహాళ్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద అర్హులు పక్కా ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని రాయదుర్గం హౌసింగ్ డీఈఈ రామ్మూర్తి, స్థానిక ఎంపీడీఓ విజయభాస్కర్ సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజనీర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ పథకంపై గ్రామీణులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అర్హులు పక్కా ఇల్లు కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని, నవంబరు ఐదో తేదీ వరకు ఈ అవకాశం ఉందని తెలిపారు. ఒక ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు ఇస్తుందని, ఆసక్తి ఉన్నవారు సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. మండలంలో ఇప్పటి వరకు పక్కా ఇల్లు కోసం 1700 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ ఏఈఈ వాసంతి తెలిపారు.

ఏపీటీఎఫ్ మండల కమిటీ ఏర్పాటు

ఉరవకొండ,అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల శాఖ కమిటీని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఆర్. లోకేష్, అధ్యక్షుడిగా వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శిగా ఏళ్ల భువనేశ్వరి చౌదరి, గౌరవ సలహాదారుడిగా ఓకే వెంకటేష్ ప్రభు, జిల్లా కౌన్సిలర్లగా బీసీ ఓబన్న, చంద్రశేఖర్, శ్రీనివాసులు, సలీంబాషా, రాముడు, లలిత, పాండురంగ, రామకృష్ణ, నరసింహులు, ఆదినారాయణ, భాగ్యమ్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కర్, మండల అధ్యక్ష కార్యదర్శులు పాండురంగ, ఓబన్న పాల్గొన్నారు.

అందుబాటులో ఉండని అధికారులు

శెట్టూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏ అధికారీ అందుబాటులో ఉండటం లేదని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు టైగర్ వన్నూరుస్వామి శుక్రవారం ఓ ప్రకటనలో వాపోయారు. రెవెన్యూ సమస్యలతో అనేకమంది రోజు ఆ కార్యాలయానికి వస్తున్నారని, అయితే తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్‌ఐ, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్లు ఎవరూ అందుబాటులో ఉండటం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి అధికారులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కంట్రోల్ కేంద్రం ఏర్పాటు

గుత్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు అత్యవసర సేవలందించేందుకు మున్సిపల్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా శుక్రవారం తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పాతబడిన ఇళ్లలో ఉండరాదని, విద్యుత్ స్తంభాల సమీపంలో వెళ్లరాదని, అత్యవసర సాయం కోసం 91009 86901 నంబరులో సంప్రదించాలన్నారు.

పాఠశాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి



పనుల అనంతరం పెరుగుపాళ్యం పాఠశాల తరగతి గది

శెట్టూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుగుపాళ్యంలో ఆదర్శ పాఠశాలలో మౌలిక వసతులు లేక సిబ్బంది, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని ఓ ఉపాధ్యాయుడు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే తన సొంత డబ్బు రూ. లక్షలు వెచ్చించి.. ఆ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాలకు పెయింటింగ్, ప్రధాన ద్వారం, మరుగుదొడ్లు, తాగునీరు, డెస్కులు, పాఠశాల గదుల్లో టైల్స్ తదితర వాటిని వేయించారు. పాఠశాలకు ఎమ్మెల్యే మౌలిక వసతులు కల్పించినందుకు ఆ పాఠశాల హెచ్‌ఎం ఓబులేష్, ఆ గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు అమరవీరుల వారోత్సవం

పెద్దపప్పూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాన్ని ఏఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి జూటూరులోని జేసీ దివాకర్‌రెడ్డి అగ్రికల్చర్ కాలేజీలో శుక్రవారం నిర్వహించారు. విద్యార్థుల్లో సేవా స్ఫూర్తిని పెంపొందించినందుకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏఎస్పీ చాగల్లు రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఆయన వెంట సీఐ రామసుబ్బయ్య, ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ జానకినాథ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

నేటి నుంచి ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

కళ్యాణదుర్గం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఎస్‌బీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ క్యాడెట్లు మండలంలోని గోళ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ, శిబాయి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఈ నెల 25 నుంచి 31 వరకు జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హర్షలత శుక్రవారం తెలిపారు. ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు శ్రీధర్, రవిశంకర్ మాట్లాడుతూ.. ఈ రెండు గ్రామాల్లో వారంపాటు ప్రతిరోజు సంబంధిత అధికారులతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

ఏఎస్‌ఐ పేరుతో మోసం

బెళుగుప్ప, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏఎస్‌ఐ పేరుతో ఓ సైబర్ నేరగాడు డబ్బు వసూలు చేసిన సంఘటన మండలకేంద్రంలో జరిగింది. తాను ఏఎస్‌ఐ ఆనందరెడ్డిని అని, బెళుగుప్ప స్టేషన్‌లో పని చేస్తున్నానని, పలువురు వ్యాపారులు, రిటైర్డ్ పోలీసు అధికారి నారాయణ స్వామికి గురువారం రాత్రి 73829 97595 నెంబరు నుంచి ఫోన్ చేశాడు. తమస్టేషన్లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ కూతురు రోడ్డు ప్రమాదంలో గాయపడిందని చెప్పాడు. మీ కుమారుడు శ్రీకాంత్ మా పక్కనే ఉన్నాడు. ఆస్పత్రి ఖర్చులకు డబ్బు లేదు రూ. 65 వేలు 87966 35305కు ఫోన్‌పే చేయాలని ఫోన్‌చేశారు. పోలీసు కూతురు అనడంతో మానవతా దృక్పథంతో డబ్బు పంపారు. శుక్రవారం గ్యాస్, మెడికల్ స్టోర్, ఎరువుల దుకాణం వారికి ఫోన్ చేశారు. వారు అనుమానం వచ్చి పోలీసులను సంప్రదించగా మా స్టేషన్‌లో ఆ పేరు గల అధికారి లేరని తెలిపారు. ఎస్‌ఐ శివ విచారణ చేయగా ఆ సెల్ నెంబర్ పూణేకు చెందిన కమలేష్‌దిగా పోలీసు విచారణలో తేలింది. ఎవరైనా కొత్త నెంబర్ నుంచి ఫోన్ చేస్తే అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివ సూచించారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

రాయదుర్గంరూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పోటీలను శుక్రవారం నిర్వహించారు. అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ పోటీలు నిర్వహించారు. ప్రతిభచాటిన విద్యార్థులు నియోజకవర్గస్థాయి పోటీల్లో పాల్గొంటారు. కార్యక్రమంలో ఎంఈఓలు మహమ్మద్‌ఇర్షాద్, వెంకట రమేష్, ప్రధానోపాధ్యాయులు శంకరన్న, మండల స్థాయి కో ఆర్డినేటర్ నాగేంద్ర, పీఈటీలు పాల్గొన్నారు.

● గుమ్మఘట్ట : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం అబ్బాస్, విద్యాకమిటీ ఛైర్మన్ యశోద, సర్పంచ్ విజయలక్ష్మి, పీఈటీలు రామాంజినేయులు పాల్గొన్నారు.

● బెళుగుప్ప : మండలంలోని విద్యార్థులకు శనివారం బెళుగుప్ప ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 విభాగాల్లో యోగా, చెస్, షటిల్, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీవైఈఓ మల్లారెడ్డి, పీడీ గోపాల్ రెడ్డి ప్రకటనలో పేర్కొన్నారు.

పంటలు వర్షార్పణం

తడిచి మొలకలొచ్చిన మొక్కజొన్న, వేరుశనగ





వేములపాడులో వర్షానికి తడిచిన మొక్కజొన్న, మొలకలు వచ్చిన మొక్కజొన్న



రుద్రంపల్లి వద్ద తడిసిన వేరుశనగ పంట

యాడికి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నాలుగురోజులుగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్న పంట దిగుబడి తడిసి రంగు మారి.. మొలకలు రావడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. రూ.లక్షలు నష్టపోయామని వాపోయారు. యాడికి మండలం వేములపాడు గ్రామానికి చెందిన నాగశేషుడు, హాజీ, కొట్టాలపల్లి గ్రామానికి చెందిన జగదీష్ తదితర రైతులు మొక్కజొన్న సాగుచేశారు. పంటకోతకు రావడంతో పొలంలో కోసిన దిగుబడిని తీసుకువచ్చి స్థానిక జాతీయ రహదారి పక్కన ఆరబెట్టారు. పంట దిగుబడి విక్రయానికి సిద్ధంగా ఉన్న సమయంలో నాలుగు రోజుల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు మొక్కజొన్నలు మొత్తం తడిచి నల్ల రంగులోకి మారాయి. ధాన్యం మొత్తం మొలకలు వచ్చాయి. వ్యాపారులు ఎవరూ కొనరని పంటను రైతులు రోడ్డుపైనే వదిలేసి వెళ్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

● దెబ్బతిన్న వేరుశనగ పంట

కుందుర్పి : మండలంలోని రుద్రంపల్లికి చెందిన వెంకటేష్ ఏడు ఎకరాలలో సాగు చేసిన వేరుశనగ పంటను తొలగించారు. నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో వర్షానికి తడిసి వేరుశనగ పంట దెబ్బతింది. వేరుశనగ పంట రంగు మారి.. మొలకలు వచ్చాయి. మండలంలోని అనేక మంది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.



పంట నాశనం

పది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంటదిగుబడి చేతికి వచ్చింది. మొక్కజొన్నలను ఆరబెట్టాను. నాలుగురోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వచ్చిన వర్షానికి మొక్కజొన్న తడిచి రంగు మారింది. వర్షానికి పంట మొత్తం నష్టపోయాను. పంట దిగుబడినంతా రోడ్డుపైనే వదిలేశా. రైతులను ఆదుకొనేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

-నాగశేషుడు, రైతు, వేములపాడు, యాడికి



రోడ్డుపైనే వదిలేశా

ఎకరా పొలంలో మొక్కజొన్న పంట సాగుచేశాను. పంట దిగుబడి రావడంతో మొక్కజొన్నను ఆరబెట్టాను. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మొక్కజొన్న తడిచి మొలకలు వచ్చాయి. వీటిని కొనడానికి వ్యాపా రులు ఎవరూ ముందుకు రారు. రోడ్డుపైనే పంట దిగుబడిని వదిలివేయాల్సి వచ్చింది.

-జగదీష్, రైతు, కొట్టాలపల్లి, యాడికి

ఎడతెరపి లేని వర్షాలు



మరువ పారుతున్న యల్లనూరు చెరువు

యల్లనూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు ఎడతెరిపి లేకుండా వర్షం పడింది. 78.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. యల్లనూరు చెరువులోకి ఎర్రవంక, కట్టుకాలువ, నడిమి వంకలు ఉధృతంగా ప్రవహించడంతో చెరువు నిండి మరువ పారింది. మండల పైభాగంలో వర్షం కురవడంతో చిత్రావతిలో నీటి ఉధృతి ఎక్కువైంది. వరి, మొక్కజొన్న, పప్పుశనగ వంటి పొలాలు నీట మునిగాయి.

● బెళుగుప్ప: తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో రబీ రైతులు ఆందోళన చెందుతున్నారు. నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో నల్లరేగడి భూములు బాగా తడిశాయి. ఇప్పటికైతే తేమశాతం పంటలకు అనుకూలంగా ఉంది. ఇక నుంచి కురిసే వానలతో తేమశాతం ఎక్కువై పైర్లు పాడవుతాయని రైతులు వాపోతున్నారు. గురువారం రాత్రి 12.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలుపుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణమండపాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కాలవ

రాయదుర్గం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్యవైశ్య సంఘం నిర్మించిన రుద్రయ్యశెట్టి కల్యాణమండపాన్ని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం ప్రారంభించారు. విప్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధి, పునరుద్ధరణకు కృషి చేస్తానని, రాయదుర్గం పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని అన్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కొనకొండ్ల గేట్ వద్ద గుడారాల్లో నివాసముంటున్న ఓ యువతి వివాహానికి ఆ నలుగురు సేవా సమితి సభ్యులు రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందించారు. కార్యక్రమంలో ఆ సమితి అధ్యక్షుడు మంజుల వెంకటేష్, సభ్యులు చక్రపాణి, మొండ్ల కేశవ, సాయి, వంశీ పాల్గొన్నారు.



పవన్‌కుమార్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు

ఘనంగా పవన్‌కుమార్ గౌడ్ జన్మదినం

గుంతకల్లుటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి, కౌన్సిలర్ ఆర్ పవన్‌కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలను స్థానిక ఇండియన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకులు, శ్రేయోభిలాషుల మధ్య ఆయన కేక్ కట్ చేశారు. ఆయనకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

ఫిర్యాదులపై విచారణ

యాడికి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిట్టూరులో ఉపాధిహామీ పనులు చేపట్టకుండా కొందరు రాజకీయ నాయకులు తనపై అసత్య ఆరోపణలు చేస్తూ, తనను మనోవేదనకు గురి చేస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ రంగస్వామి జిల్లా స్థాయి గ్రీవెన్స్‌లో ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై ఉపాధి హామి పథకం జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు, డ్వామా ఏపీడీ సుధాకర్‌రెడ్డి శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. రంగస్వామితో వివరాలు సేకరించారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఫర్వేజ్, యాడికి ఎంపీడీఓ వీరరాజు, ఏపీఓ మద్దిలేటి పాల్గొన్నారు.

● శెట్టూరు : స్థానిక ఆదర్శ పాఠశాలలో ఓ విద్యార్థిని పట్ల జూనియర్ సహాయకుడు అసభ్యంగా ప్రవర్తించాడని జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు అందింది. దీంతో జిల్లా ఉపాధ్యాయ అధికారి పాటిల్ మల్లారెడ్డి ఆ పాఠశాలలో శుక్రవారం విచారణ చేపట్టారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆరా తీశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు.

● పుట్లూరు : మండలంలోని చాలవేముల పంచాయతీ కార్యదర్శి ఉపాధిహామికి సంబంధించిన మెటీరియల్ బిల్లులను అక్రమంగా డ్రా చేసుకున్నారని జిల్లాస్థాయి గ్రీవెన్స్‌లో పి.చింతలపల్లికి చెందిన సుదర్శన్‌రెడ్డి, మరో వ్యక్తి ఇటీవల ఫిర్యాదు చేశారు. దీనిపై డ్వామా అడిషనల్ పీడీ సుధాకర్‌రెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీనివాసులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విచారణ చేపట్టారు. వారిద్దరి నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో ఏపీఓ తులసీప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సౌత్‌జోన్ పోటీలకు ఎంపిక





సురేఖ, గౌతమి

గుంతకల్లుటౌన్/తాడిపత్రి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో గురువారం నిర్వహించిన ఎస్కే యూనివర్శిటీ ఇంటర్ కాలేజ్ కబడ్డీ టోర్నీలో గుంతకల్లు ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని పీ సురేఖ, తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని గౌతమి ప్రతిభ చాటారు. వీరు ఈనెల 29 నుంచి నవంబరు 2 వరకు తమిళనాడులోని చెన్నై క్యాంపస్‌లో నిర్వహించే సౌత్‌జోన్ కబడ్డీ పోటీలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్శిటీ తరఫున పాల్గొంటారు.

రహదారులు అధ్వానం

నరకంగా మారిన ప్రయాణం

బొమ్మనహాళ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బొమ్మనహాళ్ నుంచి బళ్లారికి ఉన్న 18 కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనాల్లో ప్రయాణానికి కనీసం గంట సమ యం పడుతోంది. ఈ రోడ్డు రెండు కిలోమీటర్లు అనంతపురం జిల్లాలో.. 16 కిలో మీటర్లు కర్ణాటక పరిధిలోని బళ్లారి జిల్లా పరిధిలో ఉండటంతో.. ఇరు జిల్లాల అధికారులు, పాలకులు ఈ సమస్య గురించి పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డుఎక్కడ చూసిన గుం తలే. ప్రస్తుతం వానలు వస్తుండటంతో రోడ్లు నీటి మడుగులను తలపిస్తున్నాయి. బొమ్మనహాళ్ మండలంలో వివిధ ఫ్యాక్టరీలకు భారీ లారీలు, ట్రాక్టర్లు ఈ రోడ్డు పై వెళ్తుండటంతో.. అది పూర్తిగా ధ్వంసమైం ది. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల నుంచి బళ్లారిలోని విమ్స్‌కు రోజూ అనేకమంది రోగులు వెళ్తుంటారు. ఈ రోడ్డు బాగాలేకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అనంతపురం, బళ్లారి జిల్లా అధికారులు స్పందించి.. ఈ సమస్యను పరిష్కరించాలని మండల వాసులు కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న బొమ్మనహాళ్ రోడ్డు



కొత్తపల్లి రహదారిపై బురదలో చిక్కుకున్న పాఠశాల బస్సు

● కణేకల్లు : మండలంలోని కొత్తపల్లి, రచ్చుమర్రి, ఆదిగానిపల్లి గ్రామాల మధ్య ఉన్న రహదారి అధ్వానంగా తయారైంది. ఇసుక టిప్పర్లు అధికంగా తిరుగుతుండడంతో రహదారి ఇలా తయారైంది. మూడురోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారిలో ఉన్న గుంతల్లో నీరు నిల్వ ఉంటోంది. ఈ రహదారిలో పెద్ద పెద్ద గుంతలు ఉండటంతో ఎప్పుడు.. ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మార్గంలో పిల్లలతో ప్రైవేట్ పాఠశాల బస్సులు వెళ్తుంటాయని, ఈ రోడ్డును బాగు చేసేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

బొమ్మనహాళ్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దర్గాహొన్నూరులో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను శనివారం ప్రారంభిస్తున్నట్లు బొమ్మనహాళ్ విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి తెలిపారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమణ

గుంతకల్లు/టౌన్, అక్టోబరు24(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించాలని క్షవర వృత్తిదారులు మున్సిపల్ కార్యాలయం వద్ద దీక్ష చేపట్టిన విషయం తెల్సిందే. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, గుంతకల్లు ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి డీ జగదీష్ ఆ దీక్ష చేపట్టిన క్షవర వృత్తిదారులతో శుక్రవారం మాట్లాడారు. ప్రస్తుతమున్న కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించడానికి ప్రయత్నం చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వారు దీక్షను విరమించారు.

● ట్రాక్టర్ వితరణ : పురపాలక సంఘానికి పట్టణంలోని ప్రైవేటు నర్సింగ్ హోం నిర్వాహకులు ఓ ట్రాక్టర్‌ను వితరణ చేశారు. ఆ ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. ఆ వైద్యులను సన్మానించారు.

● వైన్స్ షాపు తనిఖీ : స్థానిక బళ్లారి రోడ్డులోని భవాని వైన్స్ షాపును ఎమ్మెల్యే, ఎక్సైజ్ పోలీసులు తనిఖీచేశారు. మద్యం అసలైనదా.. కాదా.. అనే విషయాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం ఓ యాప్ తెచ్చిందని, దానిపై అవగాహన పెంచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

● సమస్యలపై సమీక్ష: పట్టణంలోని సమస్యలపై పురపాలక సంఘం కార్యాలయం ఛైర్‌పర్సన్ ఎన్ భవాని చాంబర్‌లో అధికారులు, సిబ్బందితో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. సిబ్బందిని పెంచి, శానిటేషన్ యంత్రాల వినియోగం ద్వారా పట్టణంలో పారిశుభ్రతను మెరుగుపరచాలని సూచించారు. ఆవుల యజమానులకు తుది హెచ్చరికలు జారీ చేయాలని, అయినా వారు పట్టించుకోకపోతే ఆవులను గోశాలలకు తరలించాలని ఆదేశించారు.



ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయరాం

● పోలీస్ అవుట్ పోస్ట్ ప్రారంభం: స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లా వద్ద మూతపడిన అవుట్ పోస్టును ఎమ్మెల్యే ప్రారంభించారు. అవుట్ పోస్ట్ ఏర్పాటు వల్ల స్టేషన్‌కు వెళ్లిలేని ప్రజలు ఇక్కడ ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు.

వర్షం వస్తే.. మొత్తం చిత్తడే..!



సుబ్బలక్ష్మి కాలనీ దుస్థితి

విడపనకల్లు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షం వస్తే తమ కాలనీలు మొత్తం చిత్తడి.. చిత్తడిగా మారుతున్నాయని స్థానిక సుబ్బలక్ష్మి, రసూలమ్మ కాలనీవాసులు వాపోతున్నారు. కనీసం నడటానికి కూడా వీలు లేకుండా ఉంటోందని, సీసీ రోడ్లు వేయించాలని పలు మార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదన్నారు. ఈ కాలనీలు ప్రభుత్వ రికార్డుల్లో లేవని, దీంతో సీసీ రోడ్లు వేయటం కుదరదని అధికారులు తెగేసి చెబుతున్నారన్నారు. రెండు నెలల్లో ఎన్నికలు వస్తాయని, అప్పుడు తమ కాలనీల్లోకి ఓటు అడిగేందుకు వచ్చిన నాయకులను, వారి వెంట ఉన్న అధికారులను నిలదీస్తామని సోషియల్ మీడియా ద్వారా హెచ్చరించారు.

అకారణంగా దూషిస్తే.. లెక్కలు తేలుస్తాం

ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్



మాట్లాడుతున్న గుమ్మనూరు ఈశ్వర్

గుత్తి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): తాము వైసీపీ నాయకుల గురించి పట్టించుకోబోమని.. అయినా తమను వాళ్లు అకారణంగా దూషిస్తే.. వారి లెక్కలు తేలుస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ హెచ్చరించారు. ఇన్నాళ్లు వైఎస్ జగన్‌రెడ్డి మోచేతి నీళ్లు తాగిన జయరాం.. ఇప్పుడు కమ్మవాళ్ల మోచేయి నీళ్లు తాగుతున్నాడని మాజీ ఎమ్మెల్యే వై వెంకటరామిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై తీవ్రంగా స్పందించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. వెంకటరామిరెడ్డికి వయస్సు పెరిగింది కానీ బుద్ధి పెరగలేదన్నారు. కార్యక్రమంలో కమ్మ సంఘం నాయకులు మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ ప్రభాకర్ చౌదరి, కమ్మసేవాసంఘం అధ్యక్షుడు సురేంద్ర, మాజీ సర్పంచ్ శ్రీనివాసచౌదరి పాల్గొన్నారు.

ఆసీఫ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న హిజ్రాలు

గుంతకల్లుటౌన్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి):అనంతపురానికి చెందిన ఆసీఫ్ రూ. లక్షలు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని, లేకుంటే చంపుతానని బెదిరిస్తున్నాడని స్థానిక హిజ్రాలు వాపోయారు. ఈ మేరకు స్థానిక డీఎస్పీ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన చేపట్టారు. ఆసీఫ్ ఎనిమిది నెలల నుంచి వేధింపులకు పాల్పడుతున్నాడని, అతన్ని వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని పోలీసులు వారికి తెలిపారు.

అవినీతి అధికారులను సస్పెండ్ చేయాలి

విడపనకల్లు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మురుగుదొడ్ల బిల్లులను కాజేసేందుకు ప్రయత్నించిన హౌసింగ్ , ఉపాధి హామీ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ నాయకుడు ఎంబీ చెన్నరాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం డిప్యూటి తహసీల్దారు చంద్రమోహన్ రావు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఆ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోకపోతే తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు.

నల్లలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



కూడేరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురాతన ఆలయంలో అమ్మవారి విగ్రహం లేదు. దీంతో గ్రామ పెద్దలు నల్లలమ్మ విగ్రహాన్ని ఆ ఆలయంలో ప్రతిష్ఠించాలని నిర్ణయించారు. శుక్రవారం ఉదయం ఆలయ ఆవరణంలో వేదపండితులు రుద్రాభిషేకం, శాస్త్రసూక్తం, పురుషసూక్తం, అభిషేకాలు, హోమా లు నిర్వహించి.. నల్లలమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.